# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 24 విజయవాడ 20-4-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- స్వంతభావనపై పోరాడాలి–'లిబరేషన్ ఆర్మీ డైలీ' సంపాదకీయం
- భారత–పాకిస్తాన్ ప్రజావేదిక ఉమ్మడి సదస్సు ప్రకటన
- నార్వే : బాలల హక్కుల రక్షణ పేరిట అణచివేత విధానాలు
- దేశవ్యాపితంగా దళితులపై భూస్వామ్య, అగ్రకుల దురహంకారదాడులు
- ఎండమావిగా మారిన పేదల గృహనిర్మాణం
- వివిధ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనలు


## జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం

## ప్రజాస్వామిక హక్కులపై దాడి

**జాతీయ** టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్యనిర్వాహక ఆజ్ఞను జారీచేసింది. "బయటినుండి ఎగుమతి చేయబడుతున్న", "అంతరంగికంగా తలయెత్తుతున్న" టెర్రరిస్టు కార్యకలాపాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు దేశమంతటా వున్న గూఢచారి సంస్థల మధ్య సమన్వయాన్ని ఏర్పాటుచెయ్యటం ఈ కేంద్రపు లక్ష్యంగా ప్రకటించారు. శాంతి–భద్రతల పరిరక్షణ రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో వున్నందున, ఈ కేంద్రం ఏర్పాటు రాజ్యాంగచట్టం రాష్ట్రాలకు కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే చర్యగా భావించి 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు దీనిని వ్యతిరేకించారు. జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం, భారత గూఢచారి సంస్థ ఇంటెలిజెన్సు బ్యూరోలో భాగంగా 2012 మార్చి 1 నుండి పనిచేయటం ప్రారంభించాలి. రాష్ట్రాలలో మరింతగా చర్చించేందుకు వాయిదా వేశారు. వచ్చే నెలలో రాష్ట్రముఖ్యమంత్రుల సమావేశాన్ని జరపనున్నట్టు చిదంబరం ప్రకటించారు.

ఈ కేంద్రం ఏర్పాటు గురించి చర్చ సాగుతున్నది. రాజ్యాంగ చట్టంలోని 245 నుండి 261 అధికరణాలలో వున్న విధంగా శాంతి–భద్రతలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలో వున్నాయా లేక 355వ అధికరణం ప్రకారం శాంతి–భద్రతలను కాపాడే బాధ్యతను కేంద్రంతో పంచుకోవాలా అన్న అంశంపై ఎడతెగని చర్చలు సాగుతున్నాయి. భారత దేశంలో ప్రజాస్వామికమని పిలువబడుతున్న వ్యవస్థలోని సంస్థాగత బలహీనతలను ఈ చర్చ ఎత్తిచూపింది. అయితే దోపిడీ పాలకవర్గాల నియంతృత్వం దీని స్వభావంగా వున్నదన్న వాస్తవాన్ని చర్చల్లోకి తీసుకురావటంలో విఫలమైంది. భారత ప్రజలను అణచివేసే పనిలో కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్రప్రభుత్వాలూ సమన్వయంతో సహకరించుకుంటున్నాయన్న వాస్తవాన్ని కప్పిపుచ్చింది.

భారత రిపబ్లిక్, సమాఖ్య స్వభావం కలిగివుందనీ, కేంద్రం, రాష్ట్రాలూ, స్థానిక సంస్థలూగల మూడంచెల మధ్య అధికార వికేంద్రీకరణ వున్నదని భారత పాలకవర్గాలు చెప్పుకుంటున్నాయి. కానీ ఏకాధికారంగానే వుంది.

భారత రిపబ్లిక్కుగా ఏర్పడిన గత 63 సంవత్సరాలుగా కేంద్రప్రభుత్వం అన్నిరంగాలలోనూ అధికారాలను తన చేతులలో కేంద్రీకరించుకునే చర్యలనే తీసుకుంటూ వస్తున్నది. అనేక సందర్భాలలో యిది పాలక వర్గాలలో ముఠాల మధ్యన తగవులకూ, కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై తీవ్ర చర్చలకు దారితీసింది. దేశంలో సర్వవ్యాపిత సంక్షోభం తీవ్రమైన కొలదీ అధికారాల కేంద్రీకరణ కూడా పెరుగుతూ వచ్చింది. ప్రజలను అణచివేసేందుకు నిరంకుశాధికారాల కేంద్రీకరణను సాగించిన రంగాలలో శాంతి–భద్రతలు ఒకటి.

శాంతి–భద్రతలు రాష్ట్రాల అధికార పరిధిలోనిదని స్పష్టంగా వున్నప్పటికీ, ("రాజ్యాంగ పరిధులను దాటిపోయే ప్రమాదానికి అత్యంత సమీపంగా తన చర్య వుంద"న్న చిదంబరం మాటల ప్రకారం కూడా) రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతోనే కేంద్రం తన పోలీసు అధికారాలను విస్తరించుకుంటూ వస్తున్నది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం(యుఏపిఏ), టెర్రరిస్టు నిరోధక చట్టం (పోటా)వంటి నిరంకుశాధికారాలుగల నిర్బంధ చట్టాలను చేసింది. టెర్రరిజంపై పోరాడటమన్న సాకుతో తన ఆధీనంలోని అర్ధ సైనిక బలగాలకు పోలీసు అధికారాలను కట్టబెడుతున్నది. అరెస్టుచేసి కేసుపెట్టే పోలీసు అధికారాలను ఇప్పటికే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి (సిఐఎస్ఎఫ్) ఇచ్చింది. కేంద్ర రిజర్వు పోలీసు దళానికీ(సిఆర్‌పిఎఫ్), రైల్వే రక్షక దళానికీ(ఆర్‌పిఎఫ్) పోలీసు అధికారాలను కట్టబెట్టే రెండు బిల్లులు పార్లమెంటు ముందున్నాయి. సముద్రతలంనుండి చొరబాట్లనూ, దాడులనూ నివారించటమన్న సాకుతో తీరప్రాంత పోలీసు స్టేషన్లను పెడుతున్నది. ఈ మెరైన్ పోలీసు స్టేషన్లను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలనీ నిధుల కొరతను కారణంగా చూపుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం తీర్మానం చేసింది. జాతీయ గూఢచారి సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజన్సీ) ఏర్పాటుతో కేంద్రం తనకు పోలీసు అధికారాలను కట్టబెట్టుకుంది. ఈ చర్యల తార్కిక కొనసాగింపుగానే గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలను కట్టబెట్టే చర్యలకు పూనుకున్నారు. అందులో భాగమే జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం ఏర్పాటు.

రాష్ట్ర పరిధిలోని అధికారాలను కేంద్రం లాగివేసుకునే చర్యలను రాష్ట్రప్రభుత్వాలేనాడూ వ్యతిరేకించలేదు. రాష్ట్ర అధికారాల పరిధిలోకి కేంద్రం ఆక్రమణంటూ ప్రస్తుతం కొందరు ముఖ్యమంత్రులు చూపుతున్న ఆగ్రహంలో ఏమాత్రం నిజాయితీవున్నా, ఈ నిరంకుశ చట్టాలను చేస్తున్నప్పుడు వ్యతిరేకించి వుండేవారు. తద్భిన్నంగా వాటిని ఆహ్వానించారు. శాంతి భద్రతలు రాష్ట్రాల అధికార పరిధిలోనివనీ, దానికి తూట్లు పొడవరాదనీ నేడు వాదిస్తున్న ముఖ్యమంత్రుల మాటల్లో నిజాయితీవుంటే, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తొలగించాలని ఒమర్‌అబ్దుల్లా యిటీవల చేసిన డిమాండును సమర్ధించి వుండేవారు. ఇక్కడ ఒక విషయాన్ని మనం మరువరాదు. దేశంలోని అన్నిరకాల జాతీయ లేక ప్రాంతీయ పార్టీలన్నీ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాచే, అలాగే రాష్ట్రాల అధికారాలను కుదించివేసే నిరంకుశ చట్టాలకు మద్దతు పలికాయి. ప్రస్తుతం వారు చెరగుతున్న నిప్పులు కాంగ్రెసుపై దుమ్మెత్తిపోసి రాజకీయ లబ్ధిపొందటానికుద్దేశించినదే తప్ప ప్రజల ప్రజాస్వామిక హక్కులనూ, రాష్ట్రాల హక్కులనూ కాపాడేందుకు కాదన్నది స్పష్టమే.

జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రాన్ని ఏర్పాటుచేసి కార్యనిర్వాహక ఆజ్ఞకు చట్టబద్ధతనిస్తున్నది, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం. ఈ ఆజ్ఞప్రకారం ఈ కేంద్రం సోదాలు జరపవచ్చు; ఆస్తులు జప్తు చేయవచ్చు; చట్టాలను అమలుజరిపే ఇతర సంస్థల నుండీ, ఇతర గూఢచారి సంస్థలనుండి సమాచారాన్ని పొందవచ్చు; అరెస్టులు చేయవచ్చు; ఈ అధికారాలను వాడేందుకు సాయుధ బలగాలను పిలిపించుకోవచ్చు. ఇదంతా టెర్రరిస్టు చర్యలనూ, హింసాకాండనూ ఆపేందుకని చెబుతున్నారు.

ఈ కేంద్రం పైఅధికారాలను యుఏపిఏ చట్టం నేరాలుగా నిర్వచించిన కార్యకలాపాలను నిరోధించేందుకు వినియోగించాల్సి వుంటుంది. అయితే యుఏపిఏ "దేశ సమాఖ్యనుండి విడిపోవటం", "భారతదేశ సమగ్రత, సమైక్యతలను ఖండించటం, ప్రశ్నించటం, విచ్ఛిన్నపరచటాన్ని"; "భారత్‌లో అసంతృప్తిని రేకెత్తించటాన్నీ" చట్టవిరుద్ధ చర్యలుగా నిర్వచించింది. దీనిలో హింస, టెర్రరిస్టు చర్యల ప్రసక్తిలేదు. భారతదేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకు భంగకరంగా హింసా చర్యలకు, టెర్రరిస్టు చర్యలకు పాల్పడ్డాడన్న ఆరోపణ అవసరంలేదు. అలాంటి భావన కలిగివుండటమూ, వ్యాప్తి చేయటమూ నేరాలవుతాయి.

ఉదాహరణకు స్వయంపాలనకోసం కాశ్మీర్ ప్రజల డిమాండును బలపరుస్తూ ఒక కరపత్రాన్ని పంచిపెట్టడం నేరమౌతుంది. అప్పుడు కేంద్ర గూఢచారిసంస్థ వెంటనే అరెస్టు చెయ్యవచ్చు. దీని అర్ధమేమిటి? ప్రస్తుత పాలనా వ్యవస్థకు భిన్నమైన రాజకీయ అభిప్రాయాలను కలిగివుండటమే,


(తరువాయి 2వ పేజీలో )


సంపాదకీయం

## "నాపేరు ఖాన్–నేను టెర్రరిస్టును కాను"

**ప్రతిక్షణమూ,** ప్రతి గంటా, ప్రతిరోజూ ప్రతి ముస్లిమూ ఇలా చెప్పుకోవాల్సిన దుస్థితి. ఈ పేరుతో సినిమా తీసిన షారూఖ్‌ఖాన్ అమెరికాలో మరొకసారి అవమానానికి గురయ్యాడు. టెర్రరిజంపై పోరు పేరిట అమెరికా సామ్రాజ్యవాదం ముస్లిం మతస్తులను టెర్రరిస్టులుగా ముద్రవేసి ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని అమెరికా ప్రజలలో రెచ్చగొడుతున్నది. ఒంటరిగా రైలులో ప్రయాణిస్తున్న గడ్డంతో వున్న యువకుడిని పోలీసులు తుపాకీ కాల్చి చంపారు. అతను నిరాయుధుడనీ, ముస్లింకాదనీ తేలినా అమెరికా ప్రజలలో నిరసన వ్యక్తం కానంతగా భయానక వాతావరణాన్ని కల్పించారు. టెర్రరిస్టు అని అనుమానం కలిగినా కాల్చిచంపే అధికారాన్ని పోలీసులకు కట్టబెట్టిన అమెరికా పాలకులు, అలా చంపే అధికారం సామాన్య పౌరుడికి కూడా ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారంటే ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని ఎంతగా పెంచుతున్నారో అర్ధమౌతుంది. అమెరికా పౌరుల పరిస్థితే యిలా వుంటే, భారతదేశం నుండి వెళ్ళి అక్కడ పనిచేస్తున్న యువకులు ఎంత భయంభయంగా బ్రతకాల్సి వస్తుందో ఊహించవచ్చు. భారత్‌లో మతాంతర వివాహమాడిన దంపతులకు పుట్టి, ముస్లిం పేరుతో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో వున్న యువకుడు "నాన్నా నాకు ముస్లిం పేరెందుకు పెట్టారు, నేనుండలేను, తిరిగివచ్చేస్తాన"న్న ఆవేదన అమెరికా పాలకుల ముస్లిం వ్యతిరేక చర్యల తీవ్రతను తెలుపుతుంది. భారతీయులందరూ అభిమానించే నటుడికి జరిగిన అవమానం కావటంతో విస్తృత ప్రచారం జరిగింది. ఇదేరకపు అవమానాలు అక్కడి ముస్లింలకు ప్రతిరోజూ ఎదురౌతుండటంతోపాటు, పదేపదే భారతీయ పౌరులందరికీ (ఏ మతస్తులైనా మాజీ రాష్ట్రపతితో సహా) ఎదురవటమే అమెరికా అగ్రరాజ్య దురహంకారాన్ని తెలుపుతుంది.

అయినా భారత పాలకులు నిరసన తెలపటమూ, దానికి ప్రతిగా అమెరికా అధికారి నుండి క్షమాపణ అందుకోవటమూ పరిపాటి అయింది. విదేశాంగ మంత్రి ఎస్.ఎం. కృష్ణ అమెరికాకిదొక అలవాటుగా మారిందని అన్నాడు తప్ప, అమెరికా కనుసన్నలలో నడుస్తూ టెర్రరిజంపై పోరులో భాగమైన భారత పాలకులు ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని పెంచటమే పనిగా పెట్టుకున్నారు.

ఏ టెర్రరిస్టు చర్య జరిగినా ముస్లిం యువకులను అరెస్టు చేసి విచారణ లేకుండా జైలుపాలు చేస్తున్న వార్తలు దేశం నలుమూలల నుండీ వస్తున్నాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టంతో కోర్టుముందుంచకుండా ఏళ్ల తరబడి నిర్బంధంలో వుంచుతున్నారు. ఏ కొందరు "అదృష్టవంతులో" (ఔనా!?) ఏ పదేళ్లకో బయట పడుతున్నారనటానికి హైద్రాబాదు ముస్లిం యువకులను సుప్రింకోర్టు నిరపరాధులుగా విడుదల చేయటమే తార్కాణం.

మరింత ఆందోళనకర అంశమేమంటే టెర్రరిజంపై పోరు అధినాధుల ఆరోపణలను నిరూపించేందుకు భారత పోలీసులూ, గూఢచారి సంస్థలూ పూనుకోవటం. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసానికి కొద్ది దూరంలో ఒకకారు తగలబడింది. ఎవరూ గాయపడలేదు. ప్రమాదవశాత్తూ తగలబడిందని భావించిన ఢిల్లీ పోలీసులు రెండు గంటలపాటు ఘటనా స్థలానికే రాలేదు. ఈ లోగా ఇజ్రాయిలు ఇది టెర్రరిస్టు దాడి అని ప్రకటించింది. అప్పుడు కదలిన యంత్రాంగం వెతికి వెతికి ఒక ముస్లిం జర్నలిస్టును అరెస్టు చేసింది. నెల రోజుల విచారణ, ఇంటరాగేషన్ తర్వాత ఆయన భార్య బ్యాంకు అకౌంటులో విదేశాల నుండి మూడులక్షల రూపాయలు వచ్చాయి గనుక అతనికి విదేశీ టెర్రరిస్టులతో సంబంధాలున్నట్లని పత్రికలకు చెబుతున్నారు. వాస్తవమేమిటని చూస్తే ఆ జర్నలిస్టు భార్యకు మొదటి వివాహం ద్వారా పుట్టిన బిడ్డలు తమ తల్లికి ఏడేళ్లపాటు నెలనెలా పంపిన మొత్తమది. ఈ సయ్యద్ కజ్మి ఒక ఇరానియన్ వార్తా సంస్థకు విలేఖరిగా పనిచేశాడు. తన విధి నిర్వహణలో భాగంగా పశ్చిమాసియా దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. అక్కడ అమెరికా, ఇజ్రాయిలు అనుసరిస్తున్న దురాక్రమణ విధానాలను వివరంగా రిపోర్టు చేశాడు. ఈ రకపు విమర్శనావ్యాసాలు వ్రాయటం మానుకొమ్మని జర్నలిస్టులను, ప్రత్యేకించి ఉర్దూజర్నలిస్టులను హెచ్చరించటమే ఇది.

గొద్రా తర్వాత జరిగిన ముస్లింల ఉచకోతలో భాగంగా గుల్బర్గా భవనం తగుల బెట్టి కాంగ్రెసు ఎం.పి. జాఫ్రితో సహా 80 మంది హత్యకేసులో నరేంద్రమోడీకి సంబంధంలేదని సిట్ తేల్చింది. అలాగే 1984లో ఢిల్లీలో కాంగ్రెసు నాయకులు సాగించిన సిక్కుల ఊచకోతలో కూడా రాజకీయ నాయకుల ప్రమేయం లేదని తేల్చారు. ఇలాగే మహారాష్ట్రలోనూ, అస్సాంలోనూ, ఉత్తర ప్రదేశ్‌లోనూ, బీహార్ లోనూ జరిగింది. మతోన్మాద మారణకాండకు బాధ్యులైన వారెవరికీ శిక్షలు పడకపోగా, వారికి క్లీన్‌ఛిట్ ఇచ్చారు.

దేశంలో ఇంతగా మైనారిటీ మతస్తులపై దాడులు సాగిస్తున్న భారతపాలకవర్గాలు షారూఖ్‌ఖాన్ విషయంలో చిందులు వేయటం మోసపూరితమే. పిర్రగిల్లి జోకొట్టిన చందంగా వుంది. నగ్నమైన రూపంలోనూ, నాజూకు రూపంలోనూ మెజారిటీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, అదేసమయంలో మైనారిటీలకు తామే దిక్కన్న బెదిరింపు, లాలింపు పద్ధతులను భారత దోపిడీ పాలకవర్గంలోని ముఠాలైన బిజెపి, కాంగ్రెసు అనుసరిస్తున్నాయి. ఈ వంచనాత్మక నాటకంలో భాగమే షారూఖ్‌ఖాన్‌కు జరిగిన అవమానంపై వారి వైఖరి. పాలకవర్గాలు తమదోపిడీ పాలనను సాగించుకునేందుకు ప్రజలను చీల్చి వుంచేందుకు మతోన్మాద అస్త్రాన్ని వాడుతూ, ఈ దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకునేందుకు షారూఖ్‌ఖాన్‌కు అవమానం వంటి ఘటనలను మేకవన్నె పులిలా వాడుకుంటున్నారు. సామ్రాజ్యవాదుల ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ఖండించటమో, దాని అగ్రరాజ్యదురహంకారాన్ని ఖండించటమో, మైనారిటీ ప్రజల హక్కులను కాపాడటమో, భారతదేశ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమో వారి లక్ష్యం కాదు. ✡

# నార్వే బాలల హక్కుల రక్షణ పేరిట దోపిడీ, అణచివేత విధానాలు

**నార్వే** దేశానికి పనికోసం వలస వెళ్లిన భారతీయ కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలను నార్వే ప్రభుత్వపు బాలల సంక్షేమసేవా శాఖ స్వాధీనం చేసుకుని బాలల శరణాలయంలో చేర్చింది. బాలల సంక్షేమసేవ అధికారులు ఇలా బాలలను తల్లిదండ్రుల నుండి వేరు చేసి, పెంపుడు తల్లిదండ్రులకప్పగించటం మొదటిసారి కాదు. ఒక విధానంగా అమలు జరుగుతున్నది. ఈ విధానానికి నార్వేదేశీయులలోని పేదకుటుంబాలూ, ఇతర దేశాలనుండి వలస వచ్చిన కుటుంబాలూ బలిఅవుతున్నాయి. ఇరుదేశాలలో వున్న సంస్కృతి భిన్నత్వం వల్ల ఏర్పడిన సమస్యగా చర్చ ప్రధానంగా సాగుతున్నది. ఇది సమస్యతో ముడిపడివున్న ఒక అంశం మాత్రమే. మరిన్ని అంశాలను లోతుగా పరిశీలించవలసివుంది.

నార్వేకు వలస వచ్చిన బెంగాలీలు సాగరిక, అనురూప్ భట్టాచార్యలకు ఏడాది నిండిన పాప, మూడేళ్ల బాబు ఉన్నారు. బాలల సంక్షేమ సేవా అధికారులు వారిని తల్లిదండ్రుల నుండి తీసుకుని శరణాలయంలో చేర్చారు. వారికి పెంపుడు తల్లిదండ్రులుగా ఎవరుండాలో నిర్ణయించి వారికప్పగిస్తారు.

అధికారులు తమ చర్యకు చెప్పిన కారణాలివి : పిల్లలకు ప్రత్యేకమైన బెడ్‌రూమ్ లేదు; తండ్రికి కారులేనందువల్ల కార్యాలయానికి వెళ్లిరావటానికి ఎక్కువ సమయం పడుతున్నందునా, కారు కొనుక్కునేందుకు డ్రైవింగ్ లైసెన్స్ కొరకుశిక్షణ పొందేందుకు వెళుతున్నందునా తన పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నాడు. అతనికి నార్వేజియన్ భాష రాకపోవటాన్ని కారణంగా చెప్పిన అధికారులే అతను నార్వేజియన్ భాషను నేర్చుకునేందుకు సమయం కేటాయించి, పిల్లలను పట్టించుకోలేక పోతున్నాడని తప్పుపట్టింది. పిల్లవాడికి ఆటిజం వ్యాధి వున్నదనీ, సరిగ్గా మాట్లాడలేక మౌనంగా ఉంటున్నాడన్నది మరోకారణం. తల్లిదండ్రులతో ఉద్వేగ సంబంధ రహిత లోపానికి (ఎమోషనల్లీ డిస్‌కనెక్ట్ డిజార్డర్) పిల్లలు గురయ్యారనీ అందువల్లవారి దత్తతకు చర్యలు ప్రారంభించాల్సి వచ్చిందనీ వాదించారు.

భట్టాచార్య దంపతులు దీనిపై న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. ఇరు దేశాల సంస్కృతిలో వున్న తేడా అనీ, మా సంస్కృతిలో పిల్లలు కౌమారదశ వరకూ తల్లిదండ్రుల వద్ద, తాతలవద్ద నిద్రిస్తారనీ వివరించారు. తమ పిల్లల ఆరోగ్యంగానే వున్నారనీ, భాష అర్ధంకానందున చురుకుగాలేరనీ వివరించారు. కనీసం తమ పిల్లలను మాతామహులకో, పితామహులకో అప్పగించమని కోరారు. కాగా న్యాయస్థానం అధికారులకే వత్తాసు పలికింది. పిల్లల తాతలు భారతదేశంలో పిల్లలను సరిగ్గా పెంచుతున్నారన్న నమ్మకమేమిటన్న అధికారులు వాదనను అంగీకరించింది. కాకపోతే 27 ఏళ్ల పెళ్లికాని పిల్లల బాబాయి దత్తత కర్హుడో కాదో పరిశీలిస్తానని చెప్పింది. తరువాత చేసిన విచారణలో బాబాయి అర్హుడు కాదని తేల్చింది.

నార్వే అధికారుల వాదనలు ఉద్దేశపూరితమన్నది స్పష్టమే. కారులేనందున ఎక్కువ సమయం పిల్లలకు కేటాయంచటం లేదన్న వారే డ్రైవింగ్ లైసెన్సు శిక్షణ కోసం సమయం కేటాయించటాన్ని తప్పుపట్టారు. అలాగే పిల్లలను తీసుకుపోయేందుకు తండ్రికి భాషరాకపోవటాన్ని తప్పు పడుతూనే భాషనేర్చుకునే ప్రయత్నాన్ని కూడా నేరం చేశారు. తండ్రికే రాని భాష మూడేళ్ళ పిల్లవాడికి రానందునకు తప్పుపట్టారు. అతనికొక జబ్బును అంటగట్టారు. ఇవన్నీ పిల్లలను తీసుకపోయేందుకు సాకులన్నది స్పష్టమే

ఇరు సంస్కృతుల మధ్యా వున్న తేడాలు సులభంగానే అర్ధమౌతాయి. దీనికి న్యాయకోవిదులో, పండితులో అవసరంలేదు. పశ్చిమ దేశాలలో జరిగిన అనేక నిపుణుల అధ్యయనాలు పిల్లలు-తల్లిదండ్రుల మధ్య సంబంధాలు పెళుసు బారటం అనేక సామాజిక రుగ్మతలకు కారణమౌతున్నాయని తెలిపాయి (భారతదేశంలో కుటుంబ వ్యవస్థ లోపరహితంకాదు. దానిని ప్రజాస్వామీకరించవలసిన అవసరం వుంది. అది వేరే విషయం) నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఫిన్లాండ్ (వీటిని నార్డిక్ దేశాలని పిలుస్తారు) దేశాలకు చెందిన వృత్తి నిపుణలతో నార్డిక్ దేశాల మానవ హక్కుల కమిటీ 1996లో ఏర్పాటయింది. నార్డిక్ దేశాలలో ప్రభుత్వం పిల్లలను స్వాధీనపరచుకోవటమన్నది చాలా కాలం నుండీ జరుగుతున్నదని తెలిపింది. ప్రస్తుత భారత దంపతుల పిల్లల కేసులో ఈ కమిటీ, కుటుంబాలను విచ్ఛిన్న పరిచి, పిల్లల సంరక్షణను చేపట్టే నార్వేప్రభుత్వ విధానానికి మచ్చుతునక అని విమర్శించింది. ఈ పిల్లలు మానసికఖేదానికి గురై వైకల్యం పాలై ప్రభుత్వ సహాయంపై ఆధారపడేవాళ్లుగా తయారవుతారని హెచ్చరించింది.

అలాగే ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల సదస్సు నియమించిన కమిటీ 2005 నాటి తన నివేదికలో ఇలా చెప్పింది : "తల్లిదండ్రుల నుండి దూరం చేసి దత్తతకు యిస్తున్న బాలల సంఖ్య ఆందోళనకరంగావుంది.... పిల్లలకు కుటుంబ సహజ వాతావరణాన్నే యివ్వాలి. పిల్లల ప్రయోజనమే పరమావధిగా, మరో మార్గమేదీ లేనప్పుడు ఆఖరి చర్యగా పిల్లలను శరణాలయాలకు పంపాలి."

పిల్లల సంరక్షణపట్ల నార్వే ప్రభుత్వ విధానం ఎంత తెలివి మాలినదో స్పష్టంగా తెలుస్తూనే వున్నా, దానినెందుకు కొనసాగిస్తున్నది? న్యాయస్థానాలు కూడా దానినే ఎందుకు సమర్ధిస్తున్నాయి? బిబిసి టి.వి. ఛానెల్‌లో వచ్చిన ఒక చర్చా కార్యక్రమంలో సామాన్య బ్రిటీషు తల్లి, పిల్లలు తల్లిదండ్రులతో పాటు ఒకే గదిలో నిద్రించటాన్ని ఊహించరాని బీభత్సంగా భావించ గలిగేంతగా సాంస్కృతిక వాతావరణం ఎలా సృష్టించ బడింది? భారత పౌరుడైన ఒక పసివాడిని భారత దేశంలోని అతని తాత లేక నాయనమ్మ అమ్మమ్మలు సరిగ్గా పెంచగలరో లేదో పరిశీలించే అధికారం ఒక నార్వేలోని క్రిందిస్థాయి మేజిస్ట్రేటుకు ఎలావచ్చింది? ఆ మెజిస్ట్రేటు నిర్ణయం కూడా స్కూలు విద్య పూర్తి చేసిన నార్వే ఉద్యోగిని పరిశీలనపై ఆధారపడివుంటుంది. ఇక భారత ప్రభుత్వ సార్వభౌమత్వం ఏమైనట్లు? తన పౌరుల సంరక్షణను వేరే దేశ అధికారులు నిర్ణయిస్తుంటే, కోర్టులో వాదనకు న్యాయసలహా యివ్వటానికే పరిమితమెలా కాగలిగింది?

50 లక్షల జనాభావున్న నార్వేలో 2011లో నార్వే ప్రభుత్వం 12,492 మంది పిల్లలను తల్లిదండ్రుల నుండి వేరు చేసి పెంపకానికిచ్చింది. వీరిలో నార్వేలో కొంతకాలం పనిచేయటానికొచ్చిన విదేశీయుల పిల్లలు 287 మంది. వలసవచ్చిన విదేశీయుల పిల్లలు 437 మంది; వలస వచ్చిన మొదటితరం వారి పిల్లలు 697 మంది. మిగిలిన పిల్లలు నార్వేలోని పేద వర్గాల కుటుంబాలకు చెందిన వారు.

నార్వేను సంక్షేమ రాజ్యానికి ప్రతీకగా కీర్తిస్తారు. అయినా ఆర్ధిక సంక్షోభ భారాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు వలసవచ్చిన విదేశీయులకు వ్యతిరేకంగా జాతి వివక్షతను పెంచుతున్నది. నయానాజీ శక్తులను ప్రోత్సహిస్తున్నది. గత ఏడాది రాజధాని ఆస్లోనగరంలో సాగిన మారణకాండ దీని ఫలితమే(చూడండి 'జనశక్తి' 5-8-2011) పిల్లల సంరక్షణలో కూడా జాతి వివక్షత, వర్గ వివక్షత సాగుతున్నదని పైన పేర్కొన్న అంకెలే తెలుపుతున్నాయి

పశ్చిమ దేశాలలో, అందులో భాగంగా నార్వేలో జనాభాలో వస్తున్న మార్పులు జాతి వివక్షతా విధానానికి ఒక కారణంగా వున్నది. జననాల రేటు తగ్గిపోవటంతో జనాభా పెరుగుదల తగ్గింది. మరణాల రేటుకూడా తగ్గటంతో వృద్ధుల జనాభా పెరుగుతున్నది. దీనితో జననాల రేటును పెంచేందుకు దంపతులకు అనేక ప్రోత్సహకాలనందిస్తున్నది. అలాగే విదేశాల నుండి శ్రామిక వలసను పెంచుతున్నది. ఇది ఒక ప్రక్కన, పుట్టిన శిశువులను రక్షించుకోవాలన్న తపనతో కుటుంబంలోకి ప్రభుత్వం చొరబడిపోయి కుటుంబమంటే నలుగురు నిద్రించే, విశ్రాంతి తీసుకునే చోటుగా దిగజారుస్తున్నది. రెండవవైపు వలసవచ్చిన వారిలో జననాల రేటు ఎక్కువగా వుండటంతో నార్వేజియన్ జాతి కంటే ఇతరుల సంఖ్య పెరుగుతుందన్న భయంపట్టుకుంది. వలస వచ్చిన వారి ఆర్ధిక స్థితి తక్కువగా వుంటుంది. కనుక నార్వేలోని పేద వర్గాలతో సంబంధాలు ఎక్కువగా వుంటాయి. కనుక తమ సంస్కృతి 'కలుషితం' కాకుండా చూసేందుకు పేదవర్గాల, వలస వచ్చినవారి పిల్లలకు "సాంస్కృతిక శిక్షణ"నిచ్చేందుకు పూనుకుంది. ఇతర సంస్కృతి తమపై పెత్తనాన్ని చేస్తుందన్న ఉన్మాద భావాలకు మొదట గురౌతున్నది కుటుంబమే. ఈ సాంస్కృతిక శిక్షణా కార్యక్రమం గురించి చాలా చర్చ జరుగుతున్నది. ఎక్కువ మంది ఇది సంక్షేమ రాజ్య అవగాహనను బలహీన పరుస్తుందని వాదిస్తున్నారు.

పిల్లలను తల్లిదండ్రుల నుండి దూరం చేసి పెంపకానికివ్వటమన్న విధానం ఫలితంగా ఇంతకు ముందు పేర్కొన్న మానవ హక్కుల కమిటీ చెప్పినట్లు పిల్లలను మానసిక వైకల్యురుగా చేస్తుంది. పిల్లల పట్ల, వారి పెంపకం పట్లా తల్లిదండ్రుల భాధ్యతలను నిర్దేశిస్తూ అనేక చట్టాలు చేసి అమలు చేయపూనుకున్న ప్రభుత్వం, పెంపుడు కిచ్చిన పిల్లలను సరిగ్గా పెంచుతున్నారా లేదా అన్న అంశం పట్ల ఎలాంటి శ్రద్ధనూ పెట్టలేదు. పెంచినందుకు ఈ కుటుంబాలకు ప్రభుత్వం డబ్బులిస్తుంది. ప్రతినెలా ఆ పిల్లలను పరీక్షించేందుకు పిల్లల మనస్తత్వ వైద్యుడికి డబ్బు చెల్లిస్తుంది. ఇక కోర్టులు కూడా దీనిలో భాగమయ్యాయి. తమ పిల్లలను తమకే అప్పగించాలని కోరుతూ వచ్చిన ఫిర్యాదులలో ఇంత వరకూ తల్లిదండ్రులకు అనుకూలంగా ఒక్క తీర్పూ రాలేదు. కేసులో ఓడిపోయి ఆత్మహత్యలు చేసుకున్న, పిచ్చివారిగా మారిన తల్లిదండ్రులు అనేకులున్నారు. ఓడిన కేసు ఖర్చులన్నీ భరించవలసిరావటం, అవి మోయలేని భారంగా వుండటమూ కూడా కుటుంబ విచ్ఛిన్నానికి దారితీస్తున్నాయి. తల్లిదండ్రుల వ్యతిరేక కోర్టు తీర్పులకూ కారణంగా వున్నాయి. చివరికీ పెంపకానికివ్వటమన్నది ఒక దోపిడీ పరిశ్రమగా రూపొందింది.

ఇదంతా సంక్షేమ రాజ్యమన్న భావన పేరిట పిల్లల పెంపకం, విద్య, ఆరోగ్యాలను ప్రభుత్వం చేపట్టడాన్ని ప్రగతిశీల చర్యగా ఆదర్శనీయంగా చూపిస్తున్నారు. ఈ సంక్షేమ రాజ్య ఆర్ధిక రాజకీయ స్వభావాన్ని కూడా పరిశీలించాలి.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. మానవ మారణహోమానికి దారితీసిన ఫాసిజం పుట్టుకకు పెట్టుబడిదారీ విధానమే కారణమన్న అంశాన్నీ, దాని పెరుగుదలకు ఇతర సామ్రాజ్యవాదులే కారణమన్న అంశాన్ని ప్రజలు గుర్తించారు. ముఖ్యంగా యూరపుఖండ ప్రజలు. ఆకలి, దారిద్ర్యాన్ని లేకుండా చేసి ప్రజాజీవనాన్ని గణనీయంగా మెరుగుపరచి, రాజకీయ స్వేచ్ఛలకు క్రొత్త అర్ధం యిచ్చి, ఫాసిజాన్ని ఓడించటంలో కీలకపాత్ర నిర్వహించిన సోషలిజం ప్రభావం యూరపు ప్రజలపై ప్రగాఢంగావుంది. అమెరికాలో పెరుగుతున్న పౌరహక్కుల ఉద్యమం, యూరపు వస్తున్న యుద్ధ వ్యతిరేక శాంతి ఉద్యమం తత్పర్యవసానంగా కొరియా, ఇండోచైనాలో సామ్రాజ్యవాదుల సైనిక జోక్యాల దుర్మార్గాన్ని ఖండించటం పెరుగుతున్నది.

బీటలు వారుతున్న పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడుకునేందుకు పెట్టుబడిదారీ వర్గాలు ముందుకు తెచ్చినదే సంక్షేమరాజ్య నినాదం. దీనితో కార్మిక హక్కులను గుర్తించారు; వేతనాలు పెంచారు; విద్యా, ఆరోగ్య రంగాలను ప్రభుత్వ రంగ పరిధిలోకి తెచ్చారు. సోషలిస్టు వ్యవస్థకు తామేమీ తీసిపోమన్న భ్రమలు కల్పించారు. కానీ పెట్టుబడిదారీ వర్గ నిరంకుశపాలన అంతం కాలేదు. ఈ చర్యలు సంక్షేమ రాజ్యాలని చెబుతున్న నార్డిక్ దేశాలకే పరిమితం కాలేదు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలన్నింటా అమలయ్యాయి,

మూడు దశాబ్దాలు గడిచేసరికి వీటిని తగ్గించుకుంటూ వచ్చారు. అమెరికాలో రీగన్, యూరప్‌లో బ్రిటీషు ప్రధాని థాచర్ దీనిని మొదలు పెట్టారు. 2008లో తీవ్రమైన ఆర్ధిక సంక్షోభం తర్వాత దాడిని మరింత తీవ్రపరిచారు. విద్య, ఆరోగ్యం, పెన్షన్లు, వేతనాలు అన్నింటినీ తగ్గించి వేశారు. దీనితో వర్గ వ్యత్యాసాలు పెరిగిపోయాయి.

ఈ నేపథ్యంలోనే నార్వేలోని పరిణామాలను చూడాలి. విద్య, ఆరోగ్యం, పిల్లల పెంపకం ప్రభుత్వ బాధ్యతగా చేపట్టడం ప్రగతిశీల చర్యగా భావించవచ్చు. వాస్తవానికి అలా చేపట్టాలని డిమాండు కూడా చేస్తున్నాము. అలా చేపట్టే ప్రభుత్వపు రాజకీయ, ఆర్ధిక, సాంస్కృతిక విధానాలను రూపొందించేదేవరు? ఏ ప్రయోజనాల కోసం?

ఎంతగా ప్రజాస్వామ్యపు, సంక్షేమ ముసుగు వేసుకున్నా నార్వేలో వున్నది పెట్టుబడిదారీ వర్గ నియంతృత్వమే. కనుకనే అది కుటుంబాలను విచ్ఛిన్న పరిచి, పిల్లలను మానసికంగా బలహీన పరచి ప్రభుత్వం నుండి సహాయం కోసం ఎదురు చూసేవారిగా తయారు చేసేందుకు పూనుకుంది. కుటుంబముతో, తోటి మానవులతో మానవీయ సంబంధాలు ఏర్పడకుండా చూస్తున్నది. తమ సంస్కృతే ఉన్నతమైనదన్న, ఇతర సంస్కృతులు హీనమన్న భావనలు పిల్లల్లో చొప్పించే విధానాన్ని అనుసరిస్తున్నది. ఇవన్నీ హిట్లరు చేసిన ప్రయత్నాలే. అతను తాత్కాలిక విజయం పొందినా జర్మను ప్రజలు దీనిని తిరస్కరించారు. నార్డిక్ దేశాల ప్రజల సౌజన్యం, శాంతి ప్రియత్వాలు తెలిసిన వారికి నార్వే పాలకుల ప్రయత్నాలను నార్వే ప్రజలు తిరస్కరిస్తారన్న విశ్వాసం చెక్కుచెదరదు.

దీనిని ప్రతీగా రష్యాలో సోషలిస్టు వ్యవస్థ, కుటుంబాన్ని విచ్ఛిన్నపరచ లేదు. ఫ్యూడలు అణచివేతతో నిండిన రష్యా కుటుంబవ్యవస్థను పరివర్తన చెందించి కుటుంబంలో మానవీయ విలువలను స్థాపించింది. పిల్లల పెంపకాన్ని ఆనందకర కర్తవ్యంగా చేసింది. పిల్లలను కుటుంబం నుండి దూరం చెయ్యకుండానే పిల్లల, వృద్ధుల పోషణను సామాజిక బాధ్యతగా చేసింది. వ్యక్తి ప్రయోజనాలకంటే సమిష్టి ప్రయోజనాలు ముఖ్యమన్న భావనను పరిపుష్టం చేసింది. ఫలితంగా సోషలిస్టు వ్యవస్థ ఆకలిని, నిరుద్యోగాన్నీ, పేదరికాన్ని పారద్రోలటంతో పాటుగా సోషలిస్టు సమాజ పరిరక్షణ కొరకు అసమానత్యాగాలకు పురికొల్పింది. ఈ సమిష్టి తత్వమే ఫాసిజాన్ని ఓడించింది.

కనుక రాజ్యాధికారం దోపిడీ వర్గాల చేతుల్లో వున్నంత వరకూ శ్రమ జీవులకు సంక్షేమ మన్నది వుండదు. పైగా సంక్షేమం పేరిట సాగే పథకాలన్నీ అంతిమంగా దోపిడీ వర్గ పాలనను కాపాండేందుకు రూపొందించబడతాయి. నార్వేలో పిల్లల హక్కుల రక్షణ పేరిట అమలవుతున్న విధానాల చుట్టూ అల్లుకున్న పరిణామాలు తెలుపుతున్న సత్యమిదే. ✡

---

## జాతీయ... (మొదటి పేజీ తరువాయి)

టెర్రరిస్టు లేదా హింసా చర్యలకు పాల్పడకపోయినా, ఈ కేంద్రం నేరంగా పరిగణించి, నిర్బంధిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదు. "జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం తన పోలీసు అధికారాలను వినియోగించినప్పుడు రాష్ట్ర పోలీసులకు తెలియజేస్తుంది గనుక తమ అధికారాల ఆక్రమణ గురించిన భయాలు ఉండనవసరంలేద"ని అమెరికా రాయబార కార్యాలయ అధికారి స్టీవెన్‌వైట్‌కు చిదంబరం ఇచ్చిన హామీ (ది హిందూ 1 మార్చి 2009), కేంద్రం పోలీసు అధికారాలను ఎలా దఖలు పరుచుకుంటున్నదో తెలుపుతున్నది.

ఇక సమస్య కేంద్ర - రాష్ట్రాల అధికారాల పంపకానికి పరిమితమై లేదు. గూఢచారి సంస్థలు సమాచారసేకరణ, దాని విశ్లేషణను చేసి ప్రభుత్వాని కందిస్తాయి. దానిపై ఆధారపడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అవి ప్రభుత్వానికే జవాబుదారీ. చట్టబద్ధపాలన వాటికి వర్తించదు. ప్రజల హక్కులను కాపాడే రక్షణలతో చట్టాలను అమలుజరిపే యంత్రాంగం (పోలీసులు) చట్టబద్ధ పాలనకు కట్టుబడి వుండాలి. వాటి ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాలు విచారిస్తాయి. చట్టబద్ధ పాలనకు జవాబుదారీలేని గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలుండవు.

పైగా గూఢచారి సంస్థల కార్యకలాపాలు రహస్యంగా ఉంటాయి. అవి ఎంచుకున్న పౌరులపై నిఘా వుంచటానికీ, ఫోను సంభాషణలు వినటానికీ, మన ఇళ్లల్లో సూక్ష్మ కెమేరాలుంచటానికీ వీటికి ఎవరి అనుమతీ అవసరంలేదు.

చట్టబద్ధ ఆంక్షలున్న పోలీసు వ్యవస్థే అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడేటట్లు చేస్తున్న పాలకులు, ఎలాంటి ఆంక్షలూ లేని గూఢచారి సంస్థలకు పోలీసు అధికారాలను కట్టబెట్ట బూనుకున్నారంటే, ప్రజల ప్రాథమిక, రాజ్యాంగబద్ధ పౌరహక్కులనూ, ప్రజాస్వామిక హక్కులనూ కాలరాయటంలో వెనుకాడరన్నది స్పష్టమే.

కనుక యుఏపిఏ చట్టం క్రింద, జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం ద్వారా, గూఢచారి సంస్థ ఐన ఇంటిలిజెన్స్ బ్యూరోకు పోలీసు అధికారాలను కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం రాష్ట్రాల అధికారాలను కుదించి వేయటంతో పాటు, అంతకు మించి, పౌర ప్రజాస్వామిక హక్కుల కాలరాచివేతకు పాలకుల చేతిలో ఎలాంటి ఆంక్షలూలేని నిర్బంధ సాధనమౌతుంది. కొందరు ముఖ్యమంత్రుల అసంతృప్తి, కొంత రాజకీయలబ్ధి పొందటంతో టీ కప్పులో తుఫానులా చల్లారి పోతుంది. అయితే ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులపై దాడి మరింత పదునెక్కుతుంది. ఈ దాడిని సమైక్యంగా ఎదుర్కోవలసిన కర్తవ్యం ప్రజాతంత్ర వాదులపైనా, హక్కుల సంఘాలపైనా వుంది. అందుకు పూనుకుందాం. ✡

జనశక్తి

# రివిజనిజాన్ని తిరస్కరించాలంటే స్వంతభావనపై పోరాడాలి!

## 'లిబరేషన్ ఆర్మీ డైలీ' సంపాదకీయం 8-10-1967

**మన** మహానాయకుడు మావోసేటుంగ్ **"స్వంతంపై పోరాడండి, రివిజనిజాన్ని తిరస్కరించండి"** అని పిలుపిచ్చారు. కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవపు సారాంశాన్ని ఉన్నత స్థాయిలో క్రోడీకరించి ఆయన చెప్పారు. కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించే కార్యక్రమమిది.

స్వంతంపై పోరాటం, రివిజనిజాన్ని తిరస్కరించటం అన్నవి పెనవేసుకుని వున్న అంశాలు. రివిజనిజాన్ని తిరస్కరించాలంటే స్వంతంపై పోరాడటమవసరం. స్వంత ప్రయోజనాలను తొలగించుకోగలిగినప్పుడే రివిజనిజంపై పోరాటాన్ని తుదికంటా కొనసాగించగలుగుతాము.

స్వంతంపై పోరాడటమంటే ప్రైవేటు ఆస్థిగా వ్యక్తమయ్యే స్వంత ప్రయోజనంపై, స్వార్థంగా వ్యక్తమయ్యే స్వంత ప్రయోజనంపై పోరాడటమే. ప్రైవేటు ఆస్థి భావన, స్వార్థమూ అన్నవి ప్రైవేటు యాజమాన్య వ్యవస్థ ఆర్థిక పునాదినుండి పుట్టుకొస్తాయి; తిరిగి ఆ పునాదిని బలీయం చేస్తాయి. రివిజనిజం పుట్టుకకూ, పెరుగుదలకూ ఇవి భావజాలవనరుగా వుంటాయి. మనదేశంలో ఈ ఆర్థిక పునాది మారింది. ప్రైవేటు యాజమాన్య వ్యవస్థ స్థానంలో సమిష్టి యాజమాన్య సోషలిస్టు వ్యవస్థ ఏర్పడింది. కాని పాత ఉపరితల నిర్మాణంలో భాగమైన ప్రైవేటు యాజమాన్య భావన అదృశ్యమైపోదు. అది చాలాకాలం కొనసాగుతుంది. అది నూతన సోషలిస్టు ఆర్థిక పునాదిని తినివేసే, నాశనంచేసే ప్రభావాన్ని కలిగివుంటుంది. ఈ ప్రైవేటు యాజమాన్య భావనను తుడిచిపెట్టేందుకు అలుపెరగని కృషిచేయకపోతే మన సోషలిస్టు ఆర్థిక పునాదిని పటిష్టపరచలేము; పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం పొంచివుంటుంది.

పార్టీలో అధికారం కలిగివున్న గుప్పెడుమందీ, సమాజంలో వున్న భూతాలన్నీ ప్రైవేటు యాజమాన్య వ్యవస్థనూ, భావననూ ఎలాగైనా కాపాడాలని ప్రయత్నిస్తున్నాయి. సాంస్కృతిక విప్లవం తొలగించాలని కోరుకుంటున్న పాతవ్యవస్థ, పాతబడ్డ భావాలు, పాత సంస్కృతి, పాత ఆచారాలు, అలవాట్లు -అన్నింటికీ ఒక్కమాట – "స్వంత ప్రయోజనం" సరిపోతుంది.

వర్గ శతృవులకు వ్యతిరేకంగా ఆ క్రమంలో మన శ్రేణులలో స్వంత ప్రయోజనాలను తొలగించి, సమిష్టి ప్రయోజనాలను పెంచే పోరాటంలోనే కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవం పురోగమిస్తుంది.

కామ్రేడ్ మావో మనకిలా బోధించారు:

**"మన శ్రేణులలో పెట్టిబూర్జువా భావజాలమున్న వారిని కార్మికవర్గ విప్లవపంథా వైపు నడిపించే కృషిని మనం బాగా చేయాలి. కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవ విజయానికిది కీలకాంశం".**

మనం స్వంత ప్రయోజనాలను తొలగించటానికీ, సమిష్టి ప్రయోజనాలను పెంచటానికీ కృషిచేయాలని ఆ మాటల అర్థం. సంవత్సర కాలంగా సాగుతున్న కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవపు ఆచరణ దీనినే నిరూపిస్తున్నది. ఎక్కడైతే స్వంతంపై పోరాటం విజయవంతంగా సాగిందో, అక్కడల్లా రివిజనిజం తిరస్కరణకు గురైంది. ఆ మేరకు కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవం పురోగమించింది. తద్భిన్నంగా, ఎక్కడైతే స్వంత ప్రయోజనాలు పైచేయి పొందాయో, అక్కడల్లా పెట్టిబూర్జువా ముఠాతత్వం పెరిగింది; అరాచకత్వం, చిన్నగ్రూపు మనస్తత్వం, పర్వత దుర్గ మనసత్తత్వం (తామే సర్వోన్నతులమనుకునే) ప్రబలాయి; ఇవి విధ్వంస కార్యకలాపాలు సాగించేందుకు శతృవుకు అవకాశాన్నిచ్చాయి; కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవం ఎదురుదెబ్బలకు లోనైంది; అనేక మలుపులు తిరిగింది.

ఎవరైనా స్వంత ప్రయోజనాన్ని ప్రథమ స్థానంలో వుంచితే, రివిజనిజాన్ని విమర్శించటమూ, తిరస్కరించటమూ అసాధ్యమౌతుంది. స్వంత ప్రయోజనాన్ని నిర్మూలించకపోతే, రివిజనిజాన్ని అంతమొనర్చలేము.

రివిజనిజాన్ని తిరస్కరించేటప్పుడు స్వంత ప్రయోజనం చొరబడితే, మంచికీ, చెడుకీ మధ్య తేడాను స్పష్టంగా చూడలేరు; ఒకసారి అతివాదం వైపూ, మరోసారి మితవాదం వైపూ ఒరుగుతారు; తెలుపేదో నలుపేదో గుర్తించలేరు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికీ రివిజనిజానికీ మధ్య, సోషలిస్టు పంథాకు పెట్టుబడిదారీ పంథాకు మధ్య, కార్మికవర్గ విప్లవపంథాకు బూర్జువా అభివృద్ధి నిరోధక పంథాకు మధ్య విభజన రేఖను స్పష్టంగా గుర్తించలేరు.

స్వంత ప్రయోజనాల ప్రభావంతో రివిజనిజాన్ని తిరస్కరించబూనుకుంటే, బానిసతత్వం తొలగిపోయి అరాచకత్వం తలయెత్తుతుంది; ఒంటెత్తుపోకడ తొలగిపోయి పర్వత దుర్గ మనస్తత్వం పుట్టుకొస్తుంది. ఫలితం: ఒక రూపపు బూర్జువా భావజాలం స్థానంలోకి మరొక రూపపు బూర్జువా భావజాలం వస్తుంది.

రివిజనిజాన్ని తిరస్కరించటంలో స్వంత ప్రయోజనాలు చోటు చేసుకుంటే, రివిజనిజాన్ని తిరస్కరించటం అసాధ్యమవటంతో పాటుగా, తానే రివిజనిస్టు పంథాలోకి దిగజారిపోతాడు.

స్వంత ప్రయోజనమూ, రివిజనిజమూ రెండు అహంబ్రహ్మలే. రెండూ బూర్జువా ప్రాపంచిక దృక్పథంలో భాగమే. కనుక స్వంత ప్రయోజనమన్న భూమికపై నిలచి రివిజనిజాన్ని క్షుణ్ణంగా తిరస్కరించటాన్ని ఊహించలేము.

కార్మికవర్గ సాంస్కృతిక మహావిప్లవపు దాడి, పార్టీలో అధికారంలో వుండి పెట్టుబడిదారీ పంథా చేపట్టిన గుప్పెడుమందిపై ప్రధానంగా ఎక్కుపెట్టబడివుంది. అదే సమయంలో, ప్రజలకున్న ప్రాపంచిక దృక్పథంనుండి వస్తున్న సమస్యల పరిష్కారం, బూర్జువా భావజాలం తొలగింపు, రివిజనిజం వేర్లను తవ్వితీయటం సాంస్కృతిక విప్లవ లక్ష్యంగా వుంది. ఇది ప్రాపంచిక దృక్పథంలో సంపూర్ణ విప్లవం. ప్రజల ఆత్మలను మలిచే విప్లవం; స్వంత ప్రయోజనాన్ని తొలగించే విప్లవం; సమిష్టి ప్రయోజనాన్ని పెంపొందించే విప్లవం. ఈ మహావిప్లవంలో ప్రతి శ్రామికవర్గ విప్లవకారుడూ అంతర్భాగం కావాలి. అదేసమయంలో తానే విప్లవపు దాడి లక్ష్యంగా నిలవాలి. తనలోని స్వంత ప్రయోజనంపై పోరాడేందుకూ, తన ప్రాపంచిక దృక్పథాన్ని సంపూర్ణంగా పునర్నిర్మించుకునేందుకు అతను మార్క్సిజం- లెనినిజం- మావో ఆలోచనావిధానాన్ని ఉపయోగించాలి.

సమిష్టి ప్రయోజనాలకు అంకితమై స్వంత ప్రయోజనాలను తొలగించుకున్నప్పుడు మాత్రమే, బూర్జువా ప్రాపంచిక దృక్పథం స్థానంలో కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్నుంచగలిగినప్పుడు మాత్రమే, మావో ఆలోచనా విధాన పతాకను సమున్నతంగా నిలపగలం. మావో రూపొందించిన కార్మికవర్గ విప్లవపంథా పక్షాన నిలబడగలం. ఈ విధంగా మాత్రమే కార్మికవర్గ పార్టీ స్ఫూర్తినీ, సమిష్టిప్రయోజనాలనూ మిగిలిన అన్నింటి కంటే ఉన్నత స్థానంలో వుంచగలం. మావో వ్యూహాత్మక పంథాకు కట్టుబడివుండగలం. విప్లవకర పోరాట సాధారణ అవగాహనను ముందుకు తీసుకుపోగలం. విప్లవ కూటమిని పటిష్టపరచగలం. లక్ష్యంపై దాడి ఎక్కుపెట్టగలం. చైనా కృశ్చేవులుగా వున్న కొందరు పార్టీ నాయకులను క్షుణ్ణంగా విమర్శించి తొలగించగలం. ప్రతిచోటా పోరాటం-విమర్శ-పరివర్తన అన్న "త్రివిధ మేళవింపు" కర్తవ్యాలను విజయవంతంగా సాధించగలం.

# 'భారత పాకిస్తాన్ స్నేహాన్ని పునరుద్ధరించండి! ప్రపంచాధిపత్యతత్వంపై పోరాడండి, ప్రజల ప్రతిఘటనను బలపర్చండి!!'

*__శాంతి,__ ప్రజాస్వామ్యాలకై భారత-పాకిస్తాన్ ప్రజావేదిక అలహాబాదులో నిర్వహించిన 8వ ఉమ్మడి సదస్సు ప్రకటన ఇది. ప్రతి రెండేళ్ళకొకసారి భారత-పాకిస్తాన్ దేశాలలో ఏదోఒక నగరంలో జరగాల్సిన ఉమ్మడి ప్రజా సదస్సు 2011 డిసెంబరు 29-31న అలహాబాదులో తన 8వ సదస్సును నిర్వహించింది. పాకిస్తాన్ దేశం నుండి సుమారుగా 190 మందికి పైగా ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు.* **-సంపాదకుడు**

**2005** ఫిబ్రవరి 25 నుండి 28 వరకు న్యూఢిల్లీలో జరిగిన శాంతి-ప్రజాస్వామ్యాలకోసం భారత-పాకిస్తాన్ ప్రజావేదిక సదస్సు తర్వాత మన ఉభయ దేశాల నడుమ ఉండిన సంబంధాలు అలహాబాదులో జరిగిన 8వ సదస్సు నాటికి మరింత క్షీణించాయని గ్రహించగలిగాము. గడిచిన 7 సంవత్సరాలలో ముంబయిపై జరిగిన బీభత్స దాడులను, అమెరికా నాయకత్వానగల నాటో సైనిక శక్తులు పాకిస్తాన్ సార్వభౌమాధికారంపై సాగించిన దాడులను గమనించాము.

పై నేపథ్యంలో ఏడు సంవత్సరాల క్రితంగల స్నేహ, సహకార సంబంధాలను పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత భారత-పాకిస్తాన్ ప్రజలపైన ఉంది.

ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావటానికీ, ఆర్థిక-సాంఘిక న్యాయాల కల్పనకూ, ఉభయదేశాల ప్రజల భద్రత, జీవన హక్కుల రక్షణకూ ఈ సదస్సు అంకితమవుతోంది. ప్రస్తుత ప్రపంచాధిపత్యాన్ని నెరుపుతున్న విధానాలకూ, ఉభయదేశాలలోను అధికారాన్ని చెలాయిస్తున్న అనుచర బృందాల వల్లా యివన్నీ ప్రమాదాన్నెదుర్కొంటున్నాయి. శతృత్వమూ, అనుమానాలూ మన రెండు దేశాల ప్రజలను వెన్నాడుతున్నవన్న సత్యం మమ్మల్ని కలవర పరుస్తోంది. రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు కట్టుబడిన ఈ ప్రజా వేదిక తగినంత నిశ్చయాత్మకంగా వాటిని పెంపొందించలేకపోయినందుకు విచారాన్ని ప్రకటిస్తోంది.

ఢిల్లీలో జరిగిన 2005 నాటి ఉమ్మడి సదస్సు "భారత్-పాకిస్తాన్ ప్రజల నడుమ శాంతి, సద్భావనల పెంపుదలకు శాశ్వత ప్రాతిపదికన ఒక కమిటీ (ఉన్నత వర్గాలకు భిన్నంగా) ఏర్పాటు చేయాలని" నిర్ణయించింది. భారత-పాకిస్తాన్ ప్రజలు ఉమ్మడిగా, వేర్వేరుగా సమీకృతులై, స్థిరమైన శాంతిని, ప్రజల పాత్రతో కూడిన ప్రజాస్వామ్యాన్ని, కొత్త సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాన్ని ఎలా నిర్వహించాలో సూచన చేసింది. వేదిక తన లక్ష్యాలను సాధించటానికి దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి".

వేదిక వెలుపల గల బాహ్యకారణాలు, అలాగే వేదికకున్న అంతర్గత బలహీనతలు కారణంగా ఈ నిర్ణయాలేవీ అమలు కాలేదు. ప్రస్తుత సదస్సు, పైనిర్ణయాలు ఇకముందైనా వాస్తవ రూపం పొందేట్లు చేయాలనే తన నిశ్చయాన్ని పునరుద్ఘాటిస్తోంది. సరికొత్త వ్యూహాలను రచించవలసిన, ప్రజల నడుమ సంభాషణను ప్రారంభించటానికి చొరవ చూపవలసిన, అనవసర జాప్యం, ఆటంకం లేకుండా సంయుక్త సదస్సులు జరపవలసిన అవసరాన్ని వక్కాణిస్తుంది.

కార్మిక-కర్షక సంస్థల్లాంటి ప్రజాసంఘాలు ఈ వేదిక కార్యకలాపాల్లో పాల్గొనటం తగ్గిందని అభిప్రాయ పడుతున్నాం. ఈ పరిస్థితి సాధ్యమైనంత త్వరగా సరిచేయాలని వేదిక ప్రతినబూనుతోంది.

సామ్రాజ్యవాదం దక్షిణాసియాపైన తన నీడను పరుచుకుంది. ప్రజల సార్వభౌమత్వం ప్రమాదంలో వుంది. అమెరికా కార్పొరేట్ కంపెనీలకు, బహుళ జాతి సంస్థలకూ తోడ్పడే అమెరికా-భారత అణుఒప్పందం భారతదేశ విదేశాంగ విధానాన్ని వాటికి లోబర్చేదిగా ప్రజలను కష్టాలపాలు చేసేదిగా వుంది. ఏ ఉపద్రవం లేకున్నా అన్ని అంతర్జాతీయ నియమాలను నిర్లజ్జగా ఉల్లంఘించి పాకిస్తాన్ సరిహద్దుల లోపల భాగంలో అమెరికా దాడులను నిర్వహించింది. పాకిస్తాన్ దేశపు ఉన్నత పాలకవర్గాలకు, మిలటరీకి అమెరికాతోగల బంధుత్వమే దాని శైశవ ప్రజాస్వామ్యాన్ని భయపెడుతున్నాయి.

ఈ సదస్సు భారత-పాకిస్తాన్ ప్రభుత్వాల విస్తరణవాద పథకాల్ని ఖండిస్తోంది. నయా ఉదారవాద విధానాలను స్వీకరించిన మన రెండు ప్రభుత్వాలూ రెండు దశాబ్దాలుగా అభివృద్ధి నమూనాలను మార్చుకున్నాయి. ఈ ఆర్థిక విధానాల కారణంగా ప్రజల పట్ల రాజ్యానికుండ వలసిన బాధ్యతలను మన ప్రభుత్వాలు వదిలేసుకున్నాయి. ప్రజలకు చెందిన సహజ వనరులు, వ్యక్తుల లాభాలకు విపరీతంగా కైంకర్యమయ్యే ఒక రకపు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల గుప్పెటలో రాజ్యాలు చిక్కుబడ్డాయి. ఈ విధానాలు పేదరికాన్ని, అసమానత్వాలను తీవ్రతరం గావిస్తున్నాయి. అందుచేతనే మన జనాభాలో అత్యధిక భాగం దారిద్ర్యరేఖ దిగువున జీవిస్తుంటే చాలా కొద్దిమంది సంపన్నులైపోతున్నారు.

ఈ ఆర్థిక విధానాలూ, "టెర్రరిజంపై యుద్ధమూ" మతఛాందస తత్వాన్ని రాజేస్తున్నాయి. మతాన్ని రాజకీయాలతో పెనవేస్తున్న వినాశకర విధానాలు ఉభయదేశాలలో వున్న మైనారిటీలను భయోత్పాతాలకు గురిచేస్తున్నాయి. ఈ అసహన పూరిత ఉన్మాదధోరణుల దుష్ఫలితాలకు మహిళలు, పిల్లలు, పేదవర్గాలు ఎక్కువగా బలిఅవుతున్నారు.

మన సమాజాలు పాతుకు పోయిన పితృస్వామ్య చట్రాన్ని సరిదిద్దటంలో విఫలమైనాయి. మన రోజువారీ సాంఘిక జీవితం మహిళలపట్ల వివక్షతో నిండివుంది. శాంతి-ప్రజాస్వామ్యాలకోసం భారత-పాకిస్తాన్ ప్రజావేదిక తన పనివిధానంలో లింగవివక్షకు, అన్యాయానికీ జవాబుదారీగా వుంటూ మన ప్రభుత్వాలను కూడా అలా నిలువమని వత్తిడి చేస్తుంది. మహిళలు సమాన పౌరులుగా జీవించటానికి అడ్డువచ్చే వివక్షతో కూడిన చట్టాలను రద్దు పరచాలని ప్రభుత్వాలను ఈ వేదిక కోరుతోంది.

వాస్తవాధీన రేఖకు రెండువైపులాగల కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలకనువుగా కాశ్మీరీ సమస్యను పరిష్కరించాలని ఈ వేదిక ధృడంగా అభిప్రాయపడుతోంది. కాశ్మీరుకు చెందిన రాజకీయ వర్గాలూ, పౌర సమాజాలనుండి ఈ సారి ఎక్కువమంది ప్రతినిధులుగా హాజరవటం ఈ సదస్సు సాధించిన అభివృద్ధిగా ముఖ్య అనుకూలాంశంగా చెప్పుకోవచ్చు. (వాస్తవధీన రేఖకు) రెండు వైపులా సాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనకు ముగింపునీ; అటూ-ఇటూ ఆంక్షలు లేని ప్రయాణాలనీ, రహదారుల్నీ, సమాచార సౌకర్యాల్నీ పునరుద్ధరించమనీ; ముఖ్యంగా విద్యార్థి యువజనుల నడుమ పరస్పర సంబంధాలకు, వ్యాపారాభివృద్ధికీ; రెండు కాశ్మీరుల నుండి సైన్యాల ఉపసంహరణకూ, సియాచిన్‌ను శాంతి ప్రదేశంగా ప్రకటించి తక్షణమే సైనిక ఉపసంహరణకూ; అలాగే ప్రత్యేక సైనికాధికార చట్టాల రద్దుకూ ఈ వేదికయొక్క 'కాశ్మీరు గురించిన కార్యాచరణ బృందం' డిమాండ్ చేస్తోంది. రెండు కాశ్మీరులకు చెందిన శాంతి-ప్రజాస్వామ్యాల ప్రత్యేక వేదికను నిర్మించమని సూచనచేస్తోంది.

మన ప్రాంతంలో అణునిరాయుధీకరణ, నిస్సైనికీకరణ సమస్యకు పేర్కొనదగిన గుర్తింపు ఇటీవల వచ్చింది. ప్రపంచ స్థాయిలో అణునిరాయుధీకరణకై సాగుతున్న పోరాటంలో భాగంగా దక్షిణాసియాలో అణునిరాయుధీకరణ సాగాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తోంది. ఉభయ దేశాల ప్రజల వనరులను హరిస్తున్న విపరీత ఆయుధ పోటీని నిలిపివేయాలని ఈ సదస్సు కోరుతోంది. భారత-పాకిస్తాన్ సైన్యాలు శాంతి స్థాపనాయత్నాలకు చొరవచేయటాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఉభయ దేశాల్లోని రాజ్యాంగ పరిధుల్లోనే సైన్యంపై ప్రజల అదుపును పటిష్టపరచాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తుంది.

భారత-పాకిస్తాన్ సంబంధాలను చెడగొట్టటంలో మీడియా నిర్వహిస్తున్న పాత్రపట్ల ఆందోళన ప్రకటిస్తున్నాము. భారత-పాకిస్తాన్ ప్రజల నడుమ శాంతి-ప్రజాస్వామ్యాలనభివృద్ధి పరిచే, సహకారాన్ని పెంపొందించే ప్రచార నిర్మాణాన్ని (మీడియాసెల్) ఏర్పరచాలని వేదిక ప్రతిపాదిస్తోంది.

తమ తమ సహజ వనరులపై హక్కులకోసం వివిధ ప్రజా శ్రేణులు సాగిస్తున్న ఉద్యమాలు అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా ఈ వేదిక కోరుకుంటూ వాటికి మద్దతును ప్రకటిస్తోంది. రెండు దేశాల ప్రభుత్వాలూ ప్రజల ప్రతిఘటనోద్యమాలపైన సాగిస్తున్న అణచివేతల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. బలూచిస్తాన్‌లో రాజకీయ కార్యకర్తల్నీ, మానవ హక్కుల ఉద్యమకారుల్నీ చట్టవిరుద్ధంగా హత్యలు గావించడాలూ, అదృశ్యం చెయ్యడాలూలాంటివి పెచ్చరిల్లుతూండటాన్ని ఈ సదస్సు ఖండిస్తోంది. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, కాశ్మీరు ఇంకా ఈశాన్య రాష్ట్రాలలో అణచివేత ఉధృతం గావటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. పై సమస్యల పరిష్కారానికై శాంతియుతపద్ధతులను చేపట్టమనీ, హింసావిధానాల్ని వీడమనీ రెండు దేశాల ప్రభుత్వాలకూ విజ్ఞప్తి చేస్తున్నాము.

భారత - పాకిస్తాన్ దేశాలకు లోపలనుండీ, బయటనుండీ వచ్చే ప్రమాదాల గురించీ; ప్రపంచ పెట్టుబడిదారీ ఆధిపత్యం - ప్రజల పోరాటాలూ; మానవభద్రత, కాశ్మీర్‌ల గురించిన సమస్యలపై ఈ సదస్సు వివరమైన చర్చలు జరిపింది. అంతర్జాతీయ సంఘీభావంలో భాగంగా ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న ప్రజా ప్రతిఘటనోద్యమాలను ఈ సదస్సు బలపరుస్తూ, శాంతి - ప్రజాస్వామ్యాలను కలవరపరుస్తున్న ప్రపంచ పెత్తందారీతనాన్ని ప్రతిఘటించమని భారత - పాకిస్తాన్ ప్రజలకు సదస్సు పిలుపునిస్తోంది. ★

# భారత సమాజ అర్ధఫ్యూడల్ స్వభావానికి ప్రతీకలు

# దేశవ్యాపితంగా దళితులపై భూస్వామ్య అగ్రకుల దురంహంకార హంతక దాడులు

షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల, వెనుకబడిన కులాల, మత మైనారిటీల ఉద్ధరణే తమ 'పరమోత్కృష్ట' కర్తవ్యంగా పాలన సాగిస్తున్నామని గత ఆరు దశాబ్దాల పైగా అధికారంలో కొనసాగిన పాలకులంతా ఒకే గొంతుకతో ప్రకటిస్తూవస్తున్నారు.

వేల సంవత్సరాల కాలంగా భారత ఫ్యూడల్ సమాజంలో పాదుకు పోయిన కులవ్యవస్థను రూపుమాపుతున్నామని; అట్టడుగు – అంటరాని కులాలకు, వెనుకబడిన కులాలకు విద్యా, ఉద్యోగావకాశాల్లోనూ, సామాజికం గానూ అనేక రక్షణలను, ప్రోత్సాహకాలను కల్పించటం ద్వారా, వారి జీవితాల్లో సమున్నతమైన అభివృద్ధిని సాధ్యం చేయగలుగు తున్నామని–జనవరి 26, ఆగస్టు 15ననే కాక–అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ పాలకులు తమ జబ్బల్ని తామే చరుచుకుంటూ ప్రజల్ని వంచిస్తూ కాలం గడుపుతూ వస్తున్నారు.

వేలాది కులాలుగా విభజింపబడిన నిచ్చెనమెట్ల భారత కులవ్యవస్థలో పైమెట్టుమీదున్న ప్రతికులమూ, క్రిందిమెట్ల మీదున్న కులాలపై ఆధిపత్యం చెలాయిస్తూ వస్తున్నది. అందుకే, భారతదేశంలో కులవ్యవస్థ 'శ్రమ విభజనకాదు–శ్రామికుల విభజన' అని డా॥అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు.

బ్రిటిష్ వలస పాలనానంతర కాలంలో దేశంలో అధికారంలో కొనసాగిన, కొనసాగుతున్న పాలకులంతా సామ్రాజ్యవాదుల పనుపున బడాబూర్జువా, భూస్వామ్యవర్గ ప్రయోజనాల పరిరక్షకులైనందున; అగ్రవర్ణ, మెజారిటీ హిందూ మతాధిపత్య, పితృస్వామ్య ధోరణులకు ప్రాతినిధ్యం వహించేవారు అయినందునే –గత ఆరు దశాబ్దాలపైగా కాలంలో కూడా–ప్రపంచంలోనే విశిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించుకొని, సర్వసత్తాక–లౌకిక–సామ్యవాద–గణతంత్ర వ్యవస్థ దిశగా పాలన సాగిస్తున్నామంటున్న దశాబ్దాల అనంతరమూ–కులవ్యవస్థ అంతరించిపోలేదు సరికదా, మధ్యయుగాల నాటి క్రూరత్వానికి నగిషీలు చెక్కబడి సరికొత్త రూపాలతో ఆవిష్కృతమౌతూ సామాజిక చింతనావరులను కలవరపాటుకు గురిచేస్తున్నది.

కేంద్రంలోనో, రాష్ట్రాలలోనో రాజకీయ అధికారాన్ని కైవసంజేసుకునేందుకు; చేజిక్కించుకున్న రాజకీయాధికారాన్ని నిలబెట్టు కునేందుకోసం, మోసకారితనంతో పాలకులు ప్రవేశపెట్టే వివిధ పథకాలు, చిట్టిపొట్టి సంస్కరణలు, ఆర్భాట పూరిత అభ్యుదయ చర్యల వంటివి మినహాయిస్తే వాస్తవ అర్థంలో దళితుల, అంటరాని కులాల ఊర్ధ్వ చలనానికి దోహదపడే నిర్దుష్ట చర్యలేవీ పాలకులు చేపట్టలేదనేది స్పష్టమే.

పైగా, పాలకవర్గాలు దళిత విభాగాలలోని నోరుగల సెక్షన్లను వివిధ పథకాల నిధులతో సంతృప్తిపరిచి, వివిధ మాయోపాయాలతో లోబరుచుకొని, వీరిని కమ విధానాల సమర్థకులుగా నిలుపుతూ, ఎన్నికల సందర్భంగా దళితులందరికీ ప్రతినిధులుగా వీరినే చూపుతూ తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుంటూ వస్తున్నారు. ఓట్లు, నోట్లుగా దిగజారిన భారత ఎన్నికల ప్రజాస్వామ్యంలో వీరినే మెట్లుగా ఉపయోగించుకొని అధికారపీఠాన్ని అధిరోహించటం తప్పితే, వాస్తవ అర్థంలో విద్య, వైజ్ఞానిక రంగాల్లో, శాస్త్ర

> "చిరకాలం జరిగిన మోసం
>
> బలవంతుల దౌర్జన్యాలూ,
>
> ధనవంతుల పన్నాగాలూ
>
> ఇంకానా! ఇకపై చెల్లవు
>
> ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ,
>
> ఒక జాతిని వేరొక జాతీ,
>
> పీడించే సాంఘిక ధర్మం
>
> ఇంకానా? ఇకపై సాగదు".
>
> – శ్రీశ్రీ

**ఉత్తరప్రదేశ్: దళిత యువకుని ప్రేమించినందుకు కులదురహంకార హత్య**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం–మీరట్‌జిల్లా హరా గ్రామానికి చెందిన 21 సం॥ల కేసర్ అనే అగ్రకుల యువతి తమ గ్రామానికే చెందిన ఓ దళిత యువకుని ప్రేమించింది. దీనిని ఆమె కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించటంతో, వారి అభీష్టానికి భిన్నంగా తాను ప్రేమించిన యువకునితో వెళ్ళిపోయింది. కానీ, రానున్న తీవ్రమైన పత్తిళ్ళను తట్టుకోలేనని భావించి వెనువెంటనే తనంత తానుగా ఇంటికి తిరిగివచ్చింది. దళితుని ప్రేమించటమే నేరంగా ఎంచిన అగ్రకుల కుటుంబపెద్దలు, ఆమె తిరిగివచ్చినా ఆగ్రహం చల్లారక జనవరి 5వ తేదీన ఆమె సోదరుడిచే ఆమెను హత్య గావించారు.

**మహారాష్ట్ర: అగ్రకుల యువతిని వివాహమాడిన దళితుని తల్లిని వివస్త్రను గావించి ఊరేగించటం**

మహారాష్ట్ర–సతార్‌జిల్లా–పటాన్ తాలూకా, మూలేగావ్ గ్రామంలో అగ్రకులానికి చెందిన కిసాన్‌దేశాయ్ కుటుంబంలోని ఒక యువతి అదే గ్రామానికి చెందిన ఓ దళిత యువకుని ప్రేమించి, అతనితో వెళ్ళిపోయి పెళ్ళిచేసుకోవటాన్ని సహించలేని అగ్రకుల పెత్తందార్లు, జనవరి 9వ తేదీన ఆ దళిత యువకుని తల్లి–రేఖాచవాన్ అనే 45 సం॥ల మహిళను వీధిబావివద్ద పట్టి బంధించి పదుగురి ఎదుట ఆమె బట్టలు లాగివేసి వివస్త్రను చేసి గ్రామంలో ఊరేగించారు. ఈ ఘటనపై పోలీసులు మొదట ఫిర్యాదు స్వీకరించటానికే తటపటాయించినా మీడియాలో ఈ విషయం విస్తృత ప్రచారంకావటంతో కేసు నమోదుచేయక తప్పలేదు.

**కర్ణాటక: 'పరువు' పేరిట ఉన్నత విద్యావంతురాలి హత్య**

కర్ణాటకరాష్ట్రం–మైసూరు పట్టణంలో నివాసముంటున్న ఓ కళాశాల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఉన్నత విద్యావంతురాలైన అగ్రకులానికి చెందిన ఓ యువతి, 7 సం॥ల కాలంగా అదే పట్టణంలో నివాసముంటున్న ఓ దళిత యువకునితో స్నేహ సంబంధాలలో వుంటూ, గత సం॥ నవంబర్ 23న స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అతనిని వివాహం చేసుకుంది. సహజంగానే ఈ వివాహాన్ని ఆమోదించని ఆమె కుటుంబ సభ్యులనుండి వేరై ఆమె విడిగా నివాసముంటుండగా, మైసూర్‌లోనే నివాసముంటున్న ఆమె సోదరుడు సమయంకోసం వేచివుండి మార్చి 15వ తేదీన ఆమె నివాసానికి వెళ్ళి ఆమెపై దాడిచేసి, చంపేసి, తాడుతో మెడకు ఉరివేసి ఆత్మహత్యచేసుకున్న విధంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అగ్రకుల దురహంకారంతో తమ కుటుంబ ప్రతిష్ఠమంటగలిసిందంటూ పరువు హత్యల(హానర్ కిల్లింగ్స్)పేరిట సాగుతున్న ఈ తరహా దారుణాల సంఖ్య పెరుగుతున్నది.

**ఆంధ్రప్రదేశ్: 'పరువు' పేరిట మరో పాశవిక హత్య**

మన రాష్ట్రంలోని–మహబూబ్‌నగర్‌జిల్లా, కేశంపేటమండలం, చౌలపల్లి గ్రామంలో వెనుకబడిన కులానికి చెందిన మాధవి, అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు అశోక్ ప్రేమించుకున్నారు. వివాహం చేసుకోవాలనే ఆలోచనకు వచ్చారు. వీరి ప్రేమను అంగీకరించని మాధవి తల్లిదండ్రులు జనవరి 5వ తేదీన మాధవిచేత బలవంతంగా పురుగులమందు తాగించారు. గ్రామస్థులు గమనించటంతో అప్పటికే అపస్మారక స్థితికి చేరిన మాధవిని హడావుడిగా ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మాధవి మార్గమధ్యంలోనే ప్రాణాలొదిలింది. ఇక, ఆలస్యం చేయకుండా, ఎటువంటి ఆధారాలూ లభించకుండా చేయటంకోసం వెనువెంటనే ఆమె దహన సంస్కారాలు పూర్తిచేసి తమ 'బాధ్యతను'దించుకున్నారు. వెనుకబడిన కులానికిచెంది, అగ్రకులాల దృష్టిలో తాము హీనంగా చూడబడుతూకూడా, తమ క్రిందమెట్టుపైనున్న దళితులపట్ల ఎంత క్రూరంగా వ్యవహరింపజేస్తోందీ కులవ్యవస్థ?!

**కర్ణాటక: దళిత యువకుడిని ప్రేమించి పెళ్ళాడినందుకు కన్నకూతురినే హత్యగావించటం**

కర్ణాటకరాష్ట్రం–అబాలవడి గ్రామంలో–శూద్రకులాలనుండి అగ్రకులాలుగా నిచ్చెనపైకి ఎగబ్రాకిన గౌడకులానికి చెందిన రామకృష్ణ, తన కూతురు సువర్ణ(22సం॥లు) మాండ్యా జిల్లాకు చెందిన దళిత యువకుడు గోవిందరాజు(27సం॥లు)ను ప్రేమించిన కారణంగా, వారిరువురిని కుటుంబసభ్యులు పట్టి బంధించి, అతని ఎదురుగానే ఆమెను తీవ్రంగా కొట్టి చంపి ఆపై ఉరివేసి, ఆనవాలు లేకుండా చేసేందుకు కాల్చి బూడిదచేశారు. శత్రువులు సైతం చేయటానికి సాహసించని ఎంతటి ఘోరకృత్యాలను కన్నతల్లిదండ్రులు చేతనే ఎంత అవలీలగా చేయిస్తున్నదీ కులవ్యవస్థ?! ఇక, తననూ చంపటం ఖాయమని భావించిన గోవిందరాజు అక్కడినుండి ఏదోవిధంగా తప్పుకొని, తీవ్ర భయాందోళనలతో రామకృష్ణ తరపువారి కంటపడకుండా వుండేందుకు గ్రామాలవెంటపడి తిరుగుతున్నాడు. ఇంత జరిగినా గ్రామంలో ఎవరూ ఈ ఘోరాన్ని గురించి నోరువిప్పలేదు. ఏవిధమైన పోలీసు కేసు నమోదు కాలేదు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగిన ఈ ఘటన గూర్చి ఎప్పటికో గోవిందరాజు విలేఖరులకు చెప్పటంతో వెలుగులోకి వచ్చింది.

**ఉత్తరప్రదేశ్: మైనారిటీలనూ వదలని దురహంకార హత్యలు**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం–లక్నోలోని పింక్‌సిటీలో నివాసముంటున్న 28 సం॥ రూబినా అనే ముస్లిమ్ యువతిపై, ఆమె సోదరులు అల్లాఉద్దీన్, నిజాముద్దీన్‌లు ఫిబ్రవరి 3వ తేదీన ఇనుపరాడ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి, హత్యగావించారు. తమ కుటుంబ సభ్యుల ఇష్టానికి భిన్నంగా ఓ దళితుడిని వివాహమాడటమే ఆమె చేసిన నేరం! అప్పటికి ఆమె వివాహమై నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ, మూడు సం॥ల ముక్కుపచ్చలారని ఆమె బిడ్డ ముఖంచూసైనా ఆ పాషాణులు కరగలేదు, ఆమెను హతమార్చకుండా వదల్లేదు.

**మధ్యప్రదేశ్: అగ్రకులాలపై ఫిర్యాదు చేసినందుకు దళితులపై దాడి**

మధ్యప్రదేశ్ రాష్ట్రం–పగారీబంగ్లా గ్రామంలో దళితులు కొద్దిపాటి భూమిని కలిగి వుండటమే ఆ గ్రామంలోని అగ్రకుల ఠాకూర్‌లకు కంటగింపుగా వుంది. ఏదోవిధంగా దళితుల వ్యవసాయ పనులను ఆటంకపరచటం, వారిని వేధింపులకు గురిచేయటం సర్వసాధారణంగా జరుగుతూవస్తున్నది. ఈ నేపథ్యంలో, తన పొలంలోని విద్యుత్ మోటారును ఠాకూర్‌లకు చెందినవారు దొంగిలించటాన్ని గమనించి, జగదీష్ అనే దళితుడు వారిపై సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు ఆ ఫిర్యాదును విచారించనూ లేదు, ఠాకూర్‌లపై కేసు నమోదు చేయనూలేదు. కానీ, తమపై ఫిర్యాదు చేయటాన్నే సహించలేని ఆ అగ్రకుల దురహంకారులు జనవరి 30వ తేదీన గొడ్డళ్ళు, మారణాయుధాలతో జగదీష్‌పై దాడిచేసి అతని కాళ్ళూచేతులూ నరికిపారేశారు. 'చట్టం తన పని తాను చేసుకుని పోతూనేవుంది'!

**ఆంధ్రప్రదేశ్: పెత్తందార్లపై ఫిర్యాదు చేసినందుకు దళితులపై దాడి–ఆస్తుల ధ్వంసం**

మన రాష్ట్రంలో–అనంతపురంజిల్లా–బెలుగుప్పమండలం–రమనేపల్లి గ్రామానికి చెందిన పెత్తందారులు చిన్నపాటి వివాదాన్ని పెంచి పెద్దదేసి దళితులతో ఘర్షణలకు దిగారు. దీనితో దళితులు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదుచేసి తిరిగి గ్రామం చేరుకున్నారు. తమపైనే కేసుపెట్టటానికి ఎంత ధైర్యమంటూ పెత్తందార్లు ఆగ్రహంతో ఊగిపోయారు. ఫిబ్రవరి 8వ తేదీన దళితుల వ్యవసాయ భూముల్లోని మోటార్లు, స్టార్టర్లు, పైపులైన్లను ధ్వంసంచేశారు. దళితుల గడ్డివాములను దగ్ధంచేశారు. దళితుల ఇళ్ళను తగులబెడ్తామని హెచ్చరించారు. దీనితో దళితులు మరల పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి గ్రామంలో తమకు ప్రాణహానివుందని మొత్తుకున్నా, తమ కళ్ళఎదుటేవున్న నిందితులు 'పరారీలో వున్నారంటూ' పోలీసులు చేతులు ముడుచుక్కూర్చున్నారు!

**ఆంధ్రప్రదేశ్: కూలీ డబ్బులు అడిగినందుకే దళితునిపై దాడి**

మన రాష్ట్రంలోనే–గుంటూరుజిల్లా–రొంపిచర్ల మండలం, అన్నారం గ్రామంలో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తున్న యస్.సి. కులానికి చెందిన నన్నం పెద్దులు వరికుప్పల నూర్పిళ్ళ తాలూకూ తనకు రావలసిన కూలీడబ్బులను అడిగినందుకుగానూ, ఆగ్రహించిన అగ్రకుల పెత్తందారీ కుటుంబీకులు పెద్దులును కులంపేరుతో దూషిస్తూ, ఇంట్లో బంధించి కొట్టారు. ఆపై కిరోసిన్‌పోసి నిప్పంటించి సజీవ దహనంచేశారు. ఫిబ్రవరి 12న 90శాతం కాలిన గాయాలతో పెద్దులు మరణ వాంగ్మూలం ఇచ్చి మరణించాడు. కాగా, పెత్తందారులకు చెందిన యువతిని

సాంకేతికరంగాల్లో ఈ అట్టడుగు పేదప్రజానీకం నిజమైన అభివృద్ధిని సాధించాలని ఈ పాలకులెవరూ కోరుకోవటం లేదు, కోరుకోరనేది స్పష్టమే. 1950లో ప్రారంభించిన రిజర్వేషన్లను 10 సం॥ల కొకసారి పొడిగించుకుంటూ పోతూ, ఈనాటికీ కొనసాగించటమే తమ దళిత ఉద్ధరణగా పాలక పక్షాలన్నీ ప్రగల్భాలు పలుకుతూ వస్తున్నాయి. కానీ ఈనాటికీ మెజారిటీ దళిత ప్రజానీకపు జీవితాలు 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్న చందంగానే వుండటం–వీరి 'దళిత ఉద్ధరణ' లోని బూటకత్వాన్ని తేటతెల్లంచేస్తున్నది.

ఇదొక పార్శ్వమైతే, సమాజంలో సమూల మార్పుకోసం, పీడితవర్గ రాజ్యాధికార లక్ష్యంతో వివిధ కమ్యూనిస్టు, విప్లవ పార్టీల ఆధ్వర్యంలోనూ; దళితుల హక్కుల రక్షణ, దళితుల ఆత్మగౌరవంకోసం వివిధ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ సాగుతున్న పోరాటాల తీవ్రత కారణంగా దళితులకు కాసిన్ని మెరుగైన సౌకర్యాలను, రక్షణలను కల్పిస్తున్నట్లుగా పాలకులు ప్రకటించకా, ప్రకటించిన విధంగా కొన్ని చట్టాలను రూపొందించకా తప్పటంలేదు. దళితులకు స్థానిక సంస్థలలోనూ, చట్టసభలలోనూ రిజర్వేషన్లు కల్పించటం; దళితులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేందు కోసమని రూపొందించిన 'యస్‌సి, యస్‌టి అత్యాచార (నిరోధక) చట్టం–1989'...వంటి వాటినుండి ఈనాటి యస్‌సి, యస్‌టి సబ్‌ప్లాన్ అమలుకు చట్టంచేస్తామనే వరకూ ఈ కోవలోకే వస్తాయి.

మనదేశంలో 70శాతం పైగా జనాభా వ్యవసాయంపై ఆధారపడి గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కాగా, ఈనాటికీ గ్రామాలలో మెజారిటీ వ్యవసాయ భూములన్నీ ఆయా గ్రామాల్లోని అగ్రకుల భూస్వామ్య–పెత్తందార్ల–ధనిక రైతుల చేతుల్లోనే వున్నాయన్నది కాదనలేని వాస్తవం. కనుక, గ్రామ పంచాయితీలు, తదితర స్థానిక సంస్థల ఎన్నికలలో ఆయా గ్రామాల్లో భూమి–సంపదలపై హక్కు అధికారం కలిగిన శక్తులూ లేదా వారికి లోబడివుండే దళిత లేదా రిజర్వేషన్ విభాగానికి చెందిన వారు మాత్రమే పోటీచేయ గలుగుతారు లేదా నెగ్గగలుగుతారు. కానీ సాధారణ దళితులెవరూ ఈ పరుగుపందెం దరిదాపులకు కూడా రాలేరన్నది కఠిన వాస్తవం. ఈ విధంగా పాలకులు తమకు అణిగిమణిగి పడివుండే కీలుబొమ్మలనే స్థానిక గద్దెపై కూర్చోబెట్టి, వెనుకనుండి తామే అధికారం చెలాయిస్తూ, దీనినే 'పాలనలో దళితుల భాగస్వామ్యం', 'దళితుల సాధికారిత'గా పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ ప్రజల్ని, దళితుల్ని వంచిస్తూవస్తున్నారు.

అంటరానితనం నేరం, ఘోరం అంటూ, చట్ట ప్రకారం శిక్షార్హమంటూ వందలకోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వాలు ఎన్ని ప్రచారార్భాటాలు చేసినా; యస్‌సి యస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలుచేస్తున్నామని ప్రకటిస్తున్నా–దళితులపై, అంటరాని ప్రజానీకంగా పిలవబడుతున్న వారిపై ఘోరాలూ, నేరాలూ అంతూదరీలేక సాగుతూనే వున్నాయి. ఈ చట్టాలను అమలుచేయవలసిన పోలీసు, ఉన్నతాధికార యంత్రాంగమంతా దోపిడీ పాలకుల కనుసన్నలలో నడిచేవారే గనుక, ఈ చట్టాలు దళితులకు కల్పించే రక్షణ, భద్రతలు ఏపాటివో కూడా విదిత మౌతున్నది. అగ్రకుల భూస్వాముల, పెత్తందారుల చేతిలో



దళితులు తాము దాడులకు, అత్యాచారాలకు గురయ్యామని పోలీసులకు ఫిర్యాదు చేసింది మొదలు, దానిని కేసుగా నమోదుచేయటం, సాక్ష్యాలను నమోదు చేయటం, ఛార్జిషీటుపెట్టడం, కోర్టు విచారణ జరపటం వంటి వివిధ దశలలో, పోలీసు ఉన్నతాధికారులు ఆ కేసులోని జీవాన్ని అంతా నీరుగార్చి తేల్చిపారేస్తున్నారు. అడపాదడపా దళితులపై దాడికి పాల్పడిన వారికి శిక్షలు పడినప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టు వరకూ అవి సాగలాగబడుతూ అంతులేని కాలహరణంతో ఆ 'న్యాయం' కాస్తా ఆవిరైపోతున్నది.

ప్రజల హక్కులను కాలరాచివేసే, ప్రజల పోరాటాలను శక్తివంతంగా అణచివేసే చట్టాలను మాత్రం పాలకులు - తమ సహజ దోపిడీవర్గ స్వభావానికనుగుణంగా-పకడ్బందీగా రూపొందించటమే కాకుండా, వాటిని క్రూరంగా అమలు చేయటంలోనూ ముందుంటున్నారు. అదేసందర్భంలో ఏదో మేరకు ప్రజానుకూలమైన లేదా ప్రజోపయోగమైన చట్టాన్ని రూపొందించేందుకు పాలకులను పురిగొల్పే ప్రధాన కారణం-తమ సమస్యల పరిష్కారసాధనకై ప్రజలు సాగించే నిరంతర పోరాటాలేనన్నది స్పష్టం. అయితే, దీనిని మరుగు పరిచి ఈ చట్టాన్ని చేయటమే తమ ప్రయోజకత్వంగా ప్రచారం చేసుకుంటూ మరోవైపున దానిని కాగితాలకే పరిమితంచేసి, అమలుకు నోచుకోకుండా లిటిగేషన్ల పేరిట సవాలక్ష ఆటంకాలు కల్పించి, అంతిమంగా ఆ చట్టాన్ని నీరుగార్చటం సర్వసాధారణమైంది. ప్రజోపయోగ చట్టాలకొరకు, వాటి సక్రమ అమలుకొరకు ఒకవైపున సంఘటిత పోరాటాలు సాగిస్తూనే పాలకుల దోపిడీవర్గ స్వభావాన్ని గుర్తెరిగి వెల్లడిచేస్తూ, దీనికి వ్యతిరేకంగా పేద దళిత ప్రజానీకాన్ని, ఇతర సెక్షన్ల ప్రజానీకపు మద్దతును కూడగట్టి, తమ మౌలిక సమస్యల పరిష్కారంకోసం సమరశీల పోరాటాలు సాగించాల్సిన అవసరం నేడు మరింతగా పెరుగుతూంది.

పట్టణాలలో-బస్సులు, రైళ్ళలో దళితులతో కలసి ప్రయాణించటం; కులప్రస్తావన లేకుండా హోటళ్ళలోనూ, వివాహ సందర్భాలలోనూ సాగే సహపంక్తి భోజనాలు; ఒకే పని ప్రదేశంలో వివిధ కులాల ప్రజానీకమంతా కలిసి ఉద్యోగాలు, వృత్తులు నిర్వహించటం -వంటి ఉదాహరణలను చూపించి కులనిర్మూలనకు ఇంతకు మించిన తార్కాణమేమి కావాలని కొందరు ప్రశ్నిస్తున్నారు. భారత సమాజ అంతర గర్భంలో నిబిడీ కృతమైవున్న సహజ వైరుధ్యాల కారణంగా, సాగుతున్న సంఘర్షణల ఫలితంగా అత్యంత నిదానంగా సాగే సామాజిక ఊర్ధ్వ చలనమూ; దీనిని తీవ్రంచేస్తూ సామాజిక మార్పుకోసం వివిధ విప్లవ శక్తుల ఆధ్వర్యంలో సాగుతున్న నిరంతరాయ ప్రజాపోరాటాలూ; ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తుల భావ ప్రచారాలూ; భారత పాలకులు తమ రాజకీయ అధికార ప్రయోజనాల పరిరక్షణకోసమే అయినప్పటికీ, చేపడ్తున్న చిన్నపాటి సంక్షేమ కార్యకలాపాలూ-వెరశి సామాజిక ఉపరితలంలో అనివార్యంగా కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనినే అసలుసిసలు అభివృద్ధిగా భ్రమిస్తూ, తమ కళ్ళద్దాలనే అందరూ ధరించి వీక్షించాలని, పాలకులతో గొంతు కలిపిన మేధావులు కొందరు ప్రబోధిస్తున్నారు.

వాస్తవానికి, శాస్త్ర-సాంకేతిక రంగాల్లో అత్యున్నత ప్రమాణాలు అందుకుంటున్నామని; రోదసీ-అంతరిక్ష రంగాల్లో విన్నూత్న ఆవిష్కరణలు గావిస్తున్నామని; సముద్ర- భూగర్భాల అంతు కనుక్కొంటున్నామంటూ, 21వ శతాబ్దంలో భారతదేశం ప్రగతిపథంలో వెలిగి పోతున్నదంటూ పాలకులు ఊదరగొడ్తున్న ఈ కాలంలోనే- మన మధ్యనే, మధ్యయుగాలనాటి, లేదా-అంధయుగాల నాటి సంఘటనల క్రూరత్వాన్ని మించిన ఘటనలను కంటున్నాం, వింటున్నాం.

సాంప్రదాయ ఫ్యూడల్ దోపిడీ రూపాలైన అగ్రకుల దోపిడీ, పీడనలు-అణచివేత, వడ్డీ- నాగుదోపిడీ, వెట్టిచాకిరీ, బానిసత్వం, దళితులను కాలిక్రింది చెప్పుల్లాగా అణచివుంచటం, సజీవదహనాలు, దళిత స్త్రీలపై సామూహిక అత్యాచారాలు, వివస్త్రలనుచేసి ఊరేగించటాలు, అప్పులక్రింద దళిత మహిళలను కుదువ బెట్టటం, వంశపారంపర్యంగా దళితులచేత భూస్వామ్య పెత్తందార్ల పొలాల్లో, ఇళ్ళల్లో జీతనాతాల్లేని వెట్టిచాకిరీ చేయించటం; దళితులను కుటుంబాలకు కుటుంబాలుగా సామాజికంగా వెలివేయటం; సాంఘిక బహిష్కరణలకు గురిచేయటం; దళితులకు ఆలయప్రవేశం నిషిద్ధం చేయటం; రెండు గ్లాసుల పద్ధతి, పండుగల సందర్భంగా దళితుల వేడుకలను నిషేదించటం లేదా పెత్తందార్ల అదుపాజ్ఞలకు లోబడి జరుపుకోవాలని ఆదేశించటం, పితృస్వామ్య అణచివేత, దోపిడీ కొనసాగటం; దళిత యువతీ యువకులకు అగ్రకుల యువతీ యువకులతో పరస్పర స్నేహాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళను నిషేధించటం, వీటిని అతిక్రమించి 'ఘోర నేరానికి' పాల్పడిన దళిత యువతీ, యువకులను వారి కుటుంబ సభ్యులే క్రూరాతిక్రూరంగా శిక్షించటం, హత్యలుగావించటం; దళితులతో సంపర్కానికి సిద్ధమైన అగ్రకుల యువతులను పరువుహత్యల పేరిట కన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే నిలువునా ప్రాణాలుదీయటం; విద్యాసంస్థలలో దళితులపట్ల వివక్ష, వారిని న్యూనతా భావానికి, వేధింపులకు గురిచేయటం; దళితులతో 'కంచం పొత్తు-మంచం పొత్తు'లపై నిషేధం; వీటన్నిటినీ మించి మానవ మలాన్ని దళితులు చేతులతో ఎత్తివేసి, నెత్తిపై మోసుకుపోయే అమానవీయ, ఘోర, క్రూర దుస్సహ సంఘటనలనేకం ప్రతిరోజూ-ప్రతిగంటా-ప్రతి నిముషమూ దేశంలో ఏదో మూల వెల్లడవుతూనే వున్నాయి.

దేశంలో, రాష్ట్రంలోనూ దళితులపై అగ్రకుల భూస్వామ్య, పెత్తందారీశక్తులు సాగిస్తున్న దౌష్ట్యాలలో ఈ పేర్కొన్నవి మచ్చుకు కొన్ని మాత్రమే. రోజువారీ పత్రికలు తిరగేసినా, మన చుట్టూతా పరికించి చూసినా ఈలాంటి సంఘటనలు అదుపులేకుండా సాగటాన్ని గమనించవచ్చు.

ఈ సంఘటనలన్నీ భారత సమాజపు అర్ధ భూస్వామ్య స్వభావాన్ని స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడల్, భూస్వామ్య-పెత్తందార్ల, అగ్రకుల దురహంకారుల అధికారం, పెత్తనం; దళితులు, ఇతర బలహీనవర్గాలపై వారి దౌష్ట్యం, దుర్మార్గాలు, అత్యాచారాలు, దోపిడీ అణచివేతలన్నీ ఈనాటికీ ఇంకా వివిధరూపాల్లో సాగుతున్నాయని కళ్ళకుకట్టి చూపుతున్నాయి. ఫ్యూడలిజం మనదేశంలో అవశేషంగానే మిగిలివుంది కనుక, మనదేశంలో ఎకాఎకిన సోషలిస్టు విప్లవ కర్తవ్యాలను చేపట్టాలని కొందరు చేస్తున్న సిద్ధాంతీ కరణను ఈ పై వాస్తవాలు పూర్వపక్షంచేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడలిజం పట్టును, దానిని కాపాడు కుంటూనే అత్యంత నిదానంగా తన దోపిడీకనుగుణమైన మార్పులను రుద్దుతూ వస్తున్న సామ్రాజ్యవాద ప్రయత్నాలనూ ఇవి తేటతెల్లంచేస్తున్నాయి.

కనుక, గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడలిజానికి; ఫ్యూడలిజాన్ని సామాజిక భూమిగా మలచుకున్న సామ్రాజ్యవాదానికి, దళారీ బూర్జువా వర్గాలకి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వాన రైతాంగం, ఇతర పీడిత వర్గాల ప్రజానీకం-జనతా ప్రజాతంత్ర విప్లవ లక్ష్యాన్ని చేబూని ముందుకు సాగటమే నేటి జరూరు కర్తవ్యం. మాయల ఫకీరు ప్రాణం ఏడు సముద్రాల ఆవల మర్రిచెట్టు తొర్రలోనున్న రామచిలుకలో వుందో లేదో గానీ, మన గ్రామీణ ప్రాంతాల్లో ఎదురులేని తమ రాజకీయార్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న మనువాద భూస్వాముల, పెత్తందార్ల ఆయువుపట్టు మాత్రం-మనకళ్ళెదుటే వున్న భూమిలోనే వుందని గ్రహించాలి. దళిత, పేద ప్రజానీకం 'దున్నేవానికే భూమి' నినాదంతో దేవాలయ, బంజరు, ఫారెస్టు, ప్రభుత్వ భూములతో సహా భూస్వాముల భూములను; సెజ్‌ల పేరిట దురాక్రమిస్తున్న వేలాది ఎకరాల భూములన్నింటినీ పునఃస్వాధీనం చేసుకోవటంద్వారానే దళితుల మౌలిక సమస్యల పరిష్కారం సాధ్యమౌతుంది. ఆనాడే చుండూరు, కారంచేడు, నీరుకొండ, ప్యాపిలిలు...సమసిపోయి ఆత్మవిశ్వాసం తొణికిసలాడే, ఆత్మగౌరవంతో సగర్వంగా తలెత్తుకుని జీవించేందుకు దళితులకు మార్గం సుగమమౌతుంది. ✡

బలాత్కరించబోయినందుకే తాము అతనిని శిక్షించామని అగ్రకుల పెత్తందార్లు మరో కట్టుకథను గ్రామంలో ప్రచారంలో పెట్టారు. ఏమైనా, దళితులను సజీవదహనంచేసే అధికారం, హక్కూ తమదేనని చాటుకున్నారు!

**ఆంధ్రప్రదేశ్: కూలీ పెంచమన్నందుకు దళితునిపై దాడి-మూత్రం తాగించే కండకావరం**

మనారాష్ట్రంలోనే-నెల్లూరుజిల్లా, కోటమండలం, గూడలిలో భూమి హీనులైన నిరుపేద దళితులు వ్యవసాయపనులకోసం పెత్తందార్లపై ఆధారపడి తమ జీవనం సాగిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక లోడింగుకు గానూ పెత్తందార్లు చెల్లించే 150 రూ॥లు ఏమాత్రం గిట్టుబాటు కావటంలేదని, కనీసం 50రూ॥లు పెంచమని దళిత కూలీలు పెత్తందార్లకు విన్నవించుకున్నారు. తాము విదిలించే ముష్టితో తృప్తిపడాలితప్ప, కూలీపెంచమని అడగటాన్ని అగ్రకుల అహంకారం జీర్ణించుకోలేకపోయింది. ఏప్రిల్ 5వ తేదీన కూలీ అడగటానికి వెళ్ళిన నాగయ్య అనే దళిత యువకుడిని కులంపేరుతో నానారకాలుగా దూషిస్తూ సమీపంలోని దేవాలయ ద్వారానికి ఆ యువకుణ్ణి తాళ్ళతో బంధించి మరీ కొట్టారు. ఆతనిపై దొంగతనం నేరాన్ని మోపారు. సంఘటన స్థలానికి చేరుకున్న నాగయ్యయొక్క 11 ఏళ్ళకూతురు పెత్తందార్ల కాళ్ళావేళ్ళాబడినా వారి హృదయం కరగలేదు. పైగా, దాహమవుతున్నదని మంచి నీరడిగిన నాగయ్యకు పెత్తందార్ల మూత్రమిచ్చి తాగమనటంద్వారా అగ్రకుల దురహంకారులు తమ నీచనైజాన్ని, బరితెగించిన కండకావరాన్ని ప్రదర్శించుకున్నారు.

**మహారాష్ట్ర : అప్పులిచ్చి దళితులచే వెట్టిచాకిరీ-5వేల రూ॥ బకాయి చెల్లించలేదని దళితుని సజీవదహనం**

మహారాష్ట్రలోని చింబోలిసింద్‌ఫనా గ్రామంలోని 500 కుటుంబాలలో మరాటా భూయజమానులు కొద్దిమందికాగా, అత్యధికులు దళిత కులాలకు చెందినవారే. వీరంతా భూమిహీనులూ, నిరక్షరాస్యులే. వీరంతా మరాటా భూయజమానుల పొలాల్లో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఆ గ్రామంలోని సహదేవ్‌తాయేద్, అతని కుటుంబ సభ్యులూ భూస్వాములవద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నందుకుగానూ, ఆ బాకీ తీరేంతవరకూ వారి చెరకుతోటల్లో నిర్బంధంగా కూలీపనిచేస్తూవస్తున్నారు. అప్పుక్రింద దళితులు భూయజమానులవద్ద వెట్టిచాకిరీ చేయటం అక్కడ సర్వసాధారణం. గ్రామీణ ఉపాధిహామీ పథకాలు వీరికెలాంటి ఉపాధినీ కల్పించలేదు. ఈ క్రమంలో సహదేవ్ 5వేల రూ॥ బకాయి చెల్లించలేదని నెపం మోపి భూస్వామి థాకే అందరూ చూస్తుండగానే సహదేవ్‌పై కిరోసిన్‌పోసి నిప్పంటించాడు. జనవరి 11న 93 శాతం కాలిన గాయాలతో సహదేవ్ మరణించాడు.

**బీహార్ : 300 రూ॥ అప్పు చెల్లించలేదని దళితుడి చేతులు నరికివేత**

బీహార్‌రాష్ట్రం-ఆర్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో రామ్‌సాగర్ చంద్రవంశి అనే 20 ఏళ్ళ దళిత యువకుడిపై అగ్రకుల పెత్తందారు సుశీల్ సింగ్ మరియు అతని మనుషులు-300 రూ॥ బకాయి చెల్లించలేదనే ఆరోపణతో ఫిబ్రవరి 20న మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో రామ్‌సాగర్ కుడిచేయి దాదాపు పూర్తిగా తెగిపోగా, ఎడమచేతికి మూడువేళ్ళు మాత్రమే మిగిలాయి. 'వేగంగా పురోగమిస్తుందంటు'న్న నితీష్‌కుమార్ పాలనలో పోలీసులు కనీసం ఈ ఘాతుకంపై ఫిర్యాదు నమోదు చేయటానికి కూడా సిద్ధం కాలేదు. పైగా బాధితుడు రైలు ప్రమాదంలో గాయపడినట్లుగా నమోదు చేసి పాట్నా వైద్యకళాశాల బోధనాసుపత్రిలో 8 రోజులపాటు వైద్యం సక్రమంగా అందనీయకుండా అడ్డుకున్నారు. విషయం పత్రికల ద్వారా బాహ్యప్రపంచానికి వెల్లడైన తర్వాతనే బాధితునికి కనీసపాటి వైద్యం అందటం ప్రారంభమైంది.

**హర్యానా : కరడుకట్టిన అంటరానితనం - కూజాలో నీటిని తాకినందుకు కొడవలితో దాడి**

హర్యానా రాష్ట్రం-ఫతేబాద్ జిల్లా-శాన్యానా గ్రామానికి చెందిన రాజు, రోజువారీ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించే నిరుపేద దళితుడు. తన గ్రామంలో పనులు లేకపోవటంతో పనులు వెదుక్కునేందుకు అతను పొరుగునున్న దౌలత్‌పూర్ గ్రామానికి వెళ్ళి, ఎండనబడి తిరిగి తిరిగివస్తూ బాగా దాహమై పొలంగట్టున కూజాలోనున్న నీటిని తాగబోయాడు. దీనిని గమనిస్తూ ఆ ప్రక్కనే వున్న అగ్రకులానికి చెందిన రాజేందర్ అనేరైతు, తీవ్రంగా ఆగ్రహించి తన చేతిలోనున్న కొడవలితో కూజాను అందుకోబోయిన అతని చేతిపై వేటువేశాడు. ఫిబ్రవరి 16న జరిగిన ఈ ఘటనలో రాజు చేయి తెగిపోగా, వైద్యులు అతికష్టంపైన ఆపరేషన్ నిర్వహించారు. అతను కనీసంగా కోలుకోవటానికి 3 నెలల సమయం పట్టటానికి తోడు, ఆపై కూలీపనుల నిర్వహణకూ అతని చేతులు సహకరించటం అనుమానమే!

**ఆంధ్రప్రదేశ్ : దళితుల పండుగల నిర్వహణపై విధినిషేధాలు**

మనరాష్ట్రంలో-మహబూబ్‌నగర్‌జిల్లా, గోపాల్‌పేట మండలం పదుట్ల గ్రామంలో ఈ సంవత్సరం సంక్రాంతి పండుగనాడు బోనాలను ఊరేగించనీయకుండా ఆ గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లు అడ్డుకున్నారు. దీనిపై ఆ ప్రాంత పోలీసులకు ఫిర్యాదు చేయగా సి.ఐ. ఆ గ్రామం చేరుకున్నాడు. దీనితో ధైర్యం వచ్చి, కొందరు దళితులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తుండగా సిఐ సమక్షంలోనే, కరెంటు తీసివేసి రాళ్ళతో పెత్తందార్లు దళితులపై దాడిచేసి అనేక మందిని గాయపరిచారు. దళితులే ఎదురు దాడి చేసివుంటే శాంతి భద్రతల పరిరక్షణకోసం సిఐగారు బహుశా దళితులపైనే కాల్పులు సాగించటానికి సిద్ధమై వచ్చివున్నారేమో!

**బీహార్ : దళితులపై భూస్వాముల దాడులకు రాజ్య యంత్రాంగ రక్షణ**

బీహార్ రాష్ట్రం-జహనాబాద్ జిల్లా-ఛోటీకల్ప గ్రామంలో అగ్రకుల భూస్వాములైన రాజపుట్‌లు కొన్ని కుటుంబాలుండగా, మంజీలనబడే మహాదళిత కుటుంబాలు 150కి పైగా వున్నాయి. వీరంతా రాజపుట్‌ల పొలాల్లోనూ, ఇళ్ళలోనూ చాకిరీ చేయటం ద్వారా తమ పొట్టనింపుకుంటారు. తమను ధిక్కరించాడనే ఒకే ఒక్క కారణంతో దినేష్‌మంజి అనే దళితుడిని మార్చి 30వ తేదీన 30 మందికి పైగా రాజపుట్ యువకులు కర్రలు, రాళ్ళతో దాడిచేసి క్రూరంగా హత్యగావించారు. తద్వారా మిగిలిన దళితులంతా తమకు అణిగిమణిగి వుండేట్లుగా ఒక హెచ్చరిక చేయదలిచారన్నమాట! పైన పేర్కొన్న దాడి ఘటననంతటినీ స్థానిక టీవీ ఛానెల్ ఒకటి చిత్రీకరించింది. మరో ముఖ్యమైన అంశమేమంటే, నిరాయుధడైన దళితుడిపై మూకుమ్మడిగా భూస్వాములు దాడిచేసి పాశవికంగా హత్యచేయటాన్ని అక్కడేవుండి గుడ్లప్పగించి చూస్తుండిన పోలీసులు, హత్యకు గురైన దినేష్ మంజి తండ్రిపైనే నేరారోపణ చేసి అరెస్ట్ చేయటం కొసమెరుపు! అగ్రకుల భూస్వామ్యానికి రాజ్యాంగ యంత్ర ఊడిగానికో మచ్చుతునక!

**ఆంధ్రప్రదేశ్ : దళితునికి భూమి దక్కటాన్ని సహించలేక దాడి**

మన రాష్ట్రంలో-కర్నూల్‌జిల్లా, బండి ఆత్మకూరు మండలం, బోధనం గ్రామంలో ఫ్యాక్షనిస్టుల, అగ్రకుల పెత్తందార్ల ఆధిపత్యం సాగుతూవుంది. ఆ గ్రామంలో దళితులంతా పెత్తందార్ల పొలాల్లో కూలీపనులు చేయవలసిందే. కాగా తనకున్న కొద్దిపాటి భూమిని పెత్తందార్లు కబళించబోవటాన్ని న్యాయస్థానంలో సవాల్‌చేసి 20 ఏళ్ళతర్వాత ఒక దళితుడు తన భూమిని తాను దక్కించుకోగలిగాడు. కానీ అతని సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. కక్షగట్టిన ఆగ్రామ పెత్తందార్లు ఆ దళితునిపై గండ్రగొడ్డళ్ళు, కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయాలపాల్జేశారు. దళితులు భూమిని కలిగివుండటం పెత్తందార్లకు కంటగింపేమరి!

**ఆంధ్రప్రదేశ్: దళిత కూలీలపై అగ్రకుల పెత్తందార్ల దాడి**

మనరాష్ట్రంలో-ప్రకాశంజిల్లా, మర్రిపాడు మండలం-జగ్గరాజుపాలెంలో పొగాకు చేలో కూలీపనులకు వచ్చిన దళితులు 20మంది అక్కడికి సమీపంలోని కమ్యూనిటీహాల్‌లో పరదాలు కట్టుకొని తాత్కాలిక నివాసం ఏర్పరచుకున్నారు. జనవరి 17న అదే గ్రామానికి చెందిన పెత్తందారు గంగవరపు మల్లిఖార్జునరావు మరో 20 మందిని వెంటబెట్టుకొచ్చి తమ ఇళ్ళ సమీపంలో గుడారాలు వేసుకోవటానికి వీల్లేదంటూ వాటన్నింటినీ పడదోసి విధ్వంసం సృష్టించి ఆ దళితులందరినీ రోడ్లపైకి గెంటివేశారు.

**ఆంధ్రప్రదేశ్: నివాస స్థలాలు దక్కనీయకుండా దళితులపై దాడులు**

మన రాష్ట్రంలో-గుంటూరుజిల్లా పెదకూరపాడు మండలం కాశిపాడులో ఏడెకరాల ఆంజనేయస్వామి మాన్యంలో ఎక్కువభాగాన్ని గ్రామపెత్తందార్లు ఆక్రమించుకున్నారు. అందులో మిగిలివున్న కొద్దిభాగంలో తమకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని దళితులు అర్జీలు పెట్టుకున్నారు. ఇంకా ఏమైనా మిగిలివుంటే తామే దిగమింగాలిగానీ, దళితులకు నివాసస్థలాలుగా కేటాయించటాన్ని సహించలేని పెత్తందార్లు తామే ఆ భూమిని ఆక్రమిస్తున్నట్లుగా ఆ స్థలంలో పాకలువేసి, కోరి వారితో తగవుపెట్టుకొని దళితులపై దాడిచేశారు. పెదకూరపాడు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదుచేసి గ్రామంలోకి రాగానే 'మాపైనే కేసు పెట్టేంత వాళ్ళయ్యారా' అంటూ 40 మంది జమకూడి కర్రలతో దళితులపై దాడిచేసి అనేకమందిని గాయపరిచారు.

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

**2011 వార్షిక బౌండ్లు అందుబాటులో వున్నాయి.**

వెల : రు. 150/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# ఎండమావిగా మారిన పేదల గృహనిర్మాణం

**గూడు,** కూడు, గుడ్డ ప్రజల ప్రాథమిక అవసరాలు. ప్రజలకు వాటిని అందించాల్సిన పాలకుల వైఫల్యం కారణంగా పేదలు పడరాని పాట్లుపడుతున్నారు. పస్తులతో కాలం గడుపుదామన్నా ఎండకి, వానకి, చలికి రక్షణ లేక కోట్లాది పేదలు పడరాని పాట్లు పడుతూ, వడగాలులకు, భారీ వర్షాలకు, గడ్డకట్టే చలికి ప్రతి సంవత్సరం వేలాదిగా చనిపోతున్నారు. ఇది దేశంలో, రాష్ట్రంలో ఉన్న పేదల దయనీయ పరిస్థితిని, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను వెల్లడి చేస్తున్నది. 65 సంవత్సరాల 'స్వతంత్ర' భారతావనిలో పేదలకు తలదాచుకొనే పరిస్థితి కూడా కరువవటం, ఆర్థిక అసమానతల తీవ్రతకు అద్దం పడుతున్నది.

ఇళ్లులేని పేదలందరికీ ఇళ్ళు నిర్మించి ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందచేస్తామని పాలకులు పథకాలు ప్రవేశపెట్టారు. ఇందిరా అవాజ్ పథకం ద్వారా ప్రతిపేదవాడికి ఇల్లు కల్పిస్తామని పాలకులు ప్రచారం చేస్తున్నారు. పేదలకు పూర్తి ఉపయోగంగాలేని ఇంటి పథకాల వలన ఏళ్ళుగడుస్తున్నా వారికి గూడుమాత్రం అమరటంలేదు.

## మొదలుకాని ఇళ్లు

మన రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం, 'ఎన్నికల' కార్యక్రమం, వరద బాధితుల ఇళ్ల నిర్మాణం వంటి పథకాల క్రింద 68,29,286 ఇళ్లకు ప్రభుత్వం అనుమతించింది. ఇప్పటివరకు ఇందులో 50,98,078 ఇళ్ళ నిర్మాణం మాత్రమే ప్రారంభమైనా, పూర్తి అయినవి 38,04,697 మాత్రమే. 12,93,381 ఇళ్ళ నిర్మాణం వివిధ దశల్లోఉంది. అసలు ఎటువంటి ప్రారంభానికీ నోచుకోనివి 17,31,208 ఉన్నాయి.

**వివిధ పథకాల క్రింద మంజూరైన ఇళ్ళు, వాటి వివరాలు**

| వివరాలు | ఇందిరమ్మ పథకం | ఎన్నికల ఇళ్లు | వరద బాధితుల ఇళ్లు | మొత్తం |
|---|---|---|---|---|
| మంజూరైన ఇళ్లు | 64,45,613 | 3,55,388 | 28,992 | 68,29,986 |
| నిర్మాణంలో ఉన్నవి | 48,03,687 | 2,71,355 | 23,036 | 50,88,078 |
| పూర్తి అయినవి | 36,60497 | 13,121 | -- | 38,04,697 |
| **వివిధ దశల్లో ఉన్నవి** | | | | |
| పునాదికంటే తక్కువ | 1,33,337 | | 2,780 | 1,88,117 |
| పునాదిస్థాయిలోఉన్నవి | 4,05,544 | 9,314 | 2,423 | 4,97,281 |
| లెంటల్ లెవల్ | 1,79,848 | -- | 2,240 | 1,82,088 |
| రూఫ్ లెవల్ | 4,24,461 | 50,962 | 2,472 | 4,77,895 |
| మొత్తం | 11,43,190 | 1,40,276 | 8,915 | 12,93,381 |

**ఆధారం : ఆంధ్రజ్యోతి, 25-12-11**

వివిధ పథకాల ద్వారా మంజూరైనవి, పూర్తైనవి, వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ గణాంకాలను పరిశీలిస్తే ఈ వాస్తవం వెల్లడవుతుంది. పై పట్టికను పరిశీలిస్తే వివిధ పథకాల క్రింద మంజూరు చేసిన ఇళ్ల మొత్తంలో 55 శాతం మాత్రమే పూర్తి అయ్యాయి. దాదాపు ఇంకా సగం ఇళ్ళు పూర్తి కావాల్సి వుంది. వివిధ దశల్లో నిలచిపోయిన గృహాల్లో 4,83,366 ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెందినవేనన్నది గమనించాలి.

## మొండిగోడలు

అసలు నిర్మాణం చేపట్టక పోవటానికి, వివిధ దశల్లో ఆగిపోవటానికి కారణాలను పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం ఇందిరమ్మ పథకం క్రింద ఒక్కో యూనిట్‌కి పట్టణ ప్రాంతంలో 55 వేలు, గ్రామీణ ప్రాంతంలో 45 వేలు గృహనిర్మాణం కోసం డబ్బు యిస్తున్నారు. 269 నుండి 350 చదరపు అడుగుల విస్తీర్ణంగల ఇంటి నిర్మాణం కోసం కనీసం లక్షా యాభైవేలు ఖర్చు అవుతుందని గృహ నిర్మాణశాఖ అధికారులే తెలియచేస్తున్నారు. దీని ప్రకారం ప్రభుత్వం యిచ్చే అప్పుతో పేదలు ఇళ్ళు నిర్మించుకోవటం అసాధ్యం. ఈ విషయం ప్రభుత్వానికి తెలియందికాదు. కొందరు పేదలు అష్టకష్టాలుపడి మోతుబరి రైతులను, వడ్డీవ్యాపారులను బ్రతిమలాడుకొని, ఇండ్లస్థలాల పట్టాలను వారి వద్ద కుదవపెట్టి అధిక వడ్డీలకు అప్పు తీసుకొని గృహనిర్మాణం ప్రారంభించినా ఆ డబ్బు చాలక, తిరిగి అప్పు దొరక్క మధ్యలోనే నిర్మాణం ఆపివేస్తున్నారు. అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. ఎటువంటి అప్పు దొరకని నిరుపేదలు, ప్రభుత్వంయిచ్చే డబ్బుతో ఇళ్ళుకట్టుకోవటం ఎలాగూ సాధ్యంకాదని, నిర్మాణం గురించే ఆలోచించటంలేదు.

## రుణభారం

పేదల గృహనిర్మాణానికి ప్రభుత్వం కేటాయిస్తున్న సొమ్ముపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తటంతో, దాన్నుండి బయటపడేందుకు ప్రభుత్వం చిట్కాలు చెబుతున్నది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ మహిళలే కాబట్టి, స్వయం సహాయ బృందాల నుంచి గృహరుణంగా పట్టణ ప్రాంతాల్లో 30 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 వేలు రుణంగా అందించటానికి చొరవ తీసుకోవాలని సెర్ఫ్‌కి గృహనిర్మాణ శాఖామంత్రి లేఖ వ్రాశారు. తమ వంతు సహాయం అందిస్తామని సెర్ఫ్ తెలియచేసింది. ఈ విధంగా గృహనిర్మాణానికి యిచ్చే డబ్బుని ప్రభుత్వం పెంచకుండా స్వయం సహాయక గ్రూపుల పేరుతో లబ్ధిదారులపైనే వేసింది. ఇది వారికి పెద్ద భారంగా మారుతుంది.

## అందని సహాయం

సెర్ఫ్ నుండి సానుకూలత వ్యక్తమైన తర్వాత రూఫ్ లెవల్లో నిలిచిపోయిన ఇళ్ళు పూర్తి చేయటానికి స్పెషల్ డ్రైవ్ పెడుతున్నట్లు ప్రకటించింది. జనవరి నుండి మార్చిలోపు పూర్తి చేయాలని ప్రకటించింది. ఈ డ్రైవ్ క్రింద జనవరి 1 నుండి రెండు నెలల్లో పూర్తి చేసిన ఇళ్లు కేవలం 43 వేలు మాత్రమే. మార్చి నాటికి 3 లక్షల 80 వేల ఇళ్ల నిర్మాణం పూర్తికావాలి. అది సాధ్యం కాదన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. జనవరి నుండి ఫిబ్రవరి వరకు స్వయం సహాయ బృందాల నుండి ఒక్కరికి కూడా గృహరుణం అందలేదు. దీన్ని గమనిస్తే సెర్ఫ్ సహాయం మాటలకే పరిమితమైందని, ప్రభుత్వం కూడా రుణం అందే విధంగా వత్తిడి తీసుకొని రావటం లేదనే యదార్థం బయటపడుతున్నది. ఒకవేళ స్వయం సహాయక బృందాలద్వారా సహాయం అందినా, దాని ద్వారా నిర్మాణం పూర్తికాదు. స్లాబ్ వేసుకోవటానికి కనీసం 35 వేల వరకు ఖర్చు అవుతుంది. అంటే మరో ఇరవైవేలదాకా లబ్ధిదారులు సమకూర్చుకోవాల్సి ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎస్.హెచ్.జీల ద్వారా గృహరుణాలు యివ్వటానికి బ్యాంకులు అంగీకరించటం లేదని సెర్ఫ్ అధికారులే వెల్లడిస్తున్నారు. రూఫ్ లెవల్లో నిలిచిపోయిన ఇళ్లు పూర్తిచేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే, ప్రభుత్వమే ఆ రుణం నేరుగా ఇవ్వవచ్చు. ఇందుకు 500 కోట్లు సరిపోతాయని అధికారులు లెక్కవేసి చెబుతున్నారు. తాము యిచ్చేరుణం గృహనిర్మాణానికి సరిపోతుందనుకొన్నప్పుడు, ఆ డబ్బుతో ప్రభుత్వమే గృహ నిర్మాణానికి కావాల్సిన వస్తువులన్నిటిని సరఫరా చేయవచ్చు. అందుకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావటం లేదన్నది సుస్పష్టమే. ఆ సొమ్ముతో గృహ నిర్మాంణం పూర్తి కాదన్నది ప్రభుత్వానికి తెలుసు. దీన్ని గమనిస్తే పేదలకు గృహకల్పన ఏర్పాటులో పాలకులకు ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థమౌతుంది.

పూర్తిఅయిన ఇండ్లుకూడా ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో సాధ్యంకాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అయినా, పట్టణ ప్రాంతాల్లో అయినా లబ్ధిదారులు రెండు రెట్లు అదనంగా గృహనిర్మాణం కోసం ఖర్చు పెట్టారు. పూర్తి అయిన గృహాల్లో ఏదో విధంగా డబ్బు సమకూర్చుకో గలిగిన వారివే ఎక్కువగా ఉన్నాయి. కొందరు పేదలు నానా అవస్థలు పడి అస్తుబిస్తుగా ఇళ్లు నిర్మించు కొన్నామనిపించుకొన్నారు. ఎలాంటి అవకాశాలు లేని నిరుపేదల గృహనిర్మాణం మధ్యలోనే ఆగిపోయి వున్నాయి. అవి పూర్తి కావటానికి వారి వద్ద డబ్బులేదు. ప్రభుత్వం వారికి సహాయపడదు. అందుకే పేదలకు గృహకల్పన ఎండమావిగానే ఉంది.

## వాణిజ్య ప్రయోజనాలకు పట్టం

దేశంలో గృహవసతి సమస్యగానే వుంటూ వస్తున్నది. గతంలో పేదలు బంజర్లు, పోరంబోకు భూములూ, పట్టణాలలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించుకుని తమకున్నంతలో పూరిగుడిసెలు వేసుకునేవారు. మధ్యతరగతులకు స్వంతయింటి కల సాకారం చేసుకునేందుకు అవసరాలు తగ్గించుకుని పొదుపు చేసిన సొమ్ముతో మొదట స్థలం సమకూర్చుకుని తరువాత సహకార సంస్థలు, ఇతరులవద్ద రుణం చేసి గృహ నిర్మాణం చేసుకునేవారు. రానూరానూ ప్రతిదానినీ ఆదాయ వనరుగా చూసే ప్రభుత్వ విధానాల ఫలితంగా స్వంత యిల్లు తీరని కలగానే వుండి పోతున్నది.

గతంలో మధ్యతరగతి ప్రజలు తమ స్వంత వనరులతోనే ఇళ్లనిర్మాణం చేసుకునేవారు. ఎల్ఐసి, గృహనిర్మాణ సంస్థలూ మధ్యతరగతులకు రుణ సౌకర్యం కల్పించేవి. నగరాలూ, పట్టణాల సుందరీకరణ పేరిట పేదలను తరిమి వేశారు. అలాగే రోడ్ల వెడల్పు పేరిట పేదలను ఖాళీ చేయించారు. తాము ఉపాధి పొందుతున్న ప్రాంతం నుండి తొలగించబడి ప్రత్యామ్నాయ స్థలం లేక పేదలు చెప్పనలవికాని కష్టాలు పడుతున్నారు. రెండవ వైపున భూమి ధరలు నిర్హేతుకంగా విపరీతంగా పెరిగిపోవటంతో దానిని అదుపు చేయాల్సిన ప్రభుత్వం చూస్తూ వూరుకుని పన్నులు పెంచుతూ ఆదాయవనరుగా మార్చుకుంది. దీనితో మధ్యతరగతులకు స్వంత యింటిస్థలం అందుబాటులో లేకుండా చేయటంతో పాటుగా, వారిని బిల్డర్సుపై ఆధారపడాల్సిన స్థితికి నెట్టింది. ఇక గృహనిర్మాణ సరుకుల ధరలను పెంచివేసింది. 2000 నాటికి లోడు 250 రూ॥కు లభ్యమౌతున్న ఇసుకను వేలంపాటలతో నేడు 6000 రూ.కు పెంచింది. సిమెంటు రంగాన్ని నాలుగు విదేశీ కంపెనీలకు కట్టబెట్టడంతో, సిమెంటు ధర బస్తా 85 రూ॥ నుండి గతపదేళ్లలో 350రూ॥లకు పెరిగింది. ఇక స్టీలుధర అంతర్జాతీయ రేటు ప్రకారం అమ్మాలంటూ ఒక దశలో టన్ను 70 వేల వరకూ పెంచారు. ప్రస్తుతం 40 వేలుంది. 2000 సంవత్సరంలో 15 వేలుండేది. సామాన్య మధ్యతరగతి కుటుంబం యిల్లు నిర్మించుకుంటే భూమిధర మినహాయించి చదరపు అడుగుకు 500 రూ॥ అయ్యేది ఈనాడది 2000 వరకూ చేరింది. వీటికి తోడు ఇప్పుడు గృహనిర్మాణానికి సేవా పన్ను కూడా విధించారు.

ఫలితంగా నగరాల్లోనూ, పట్టణాల్లోనూ పేదలు మురికి కూపాల్లాంటి చోట్ల నివసిస్తున్నారు. నిరంతరం అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామాలలో ఇళ్లస్థలాలు లేక నానాయాతనలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేని గాలికి కొట్టుకొనిపోయే కొంపలే వారి ఆవాసమయ్యాయి.

## మాయపుచ్చే పథకాలు

సమస్య తీవ్రత నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు బలహీనవర్గాలకు ఇళ్ల నిర్మాణ పథకాలతో భ్రమలు కల్పించేందుకు పాలకులు పూనుకున్నారు. ఇటీవల మధ్యతరగతులకు కూడా రాజీవ్ గృహకల్ప వంటి పథకాలు ప్రకటిస్తున్నారు. ఈ పథకాల క్రింద నిర్మిస్తున్న గృహాలను చూస్తే కుటుంబ అవసరాలను పరిగణించకుండా, అగ్గిపెట్టెల్లా, కోళ్లగూడుల్లా నిర్మాణం చేసారని అర్థమౌతుంది. ఇందిరాగాంధి పాలన కాలంలో సాగిన గృహ నిర్మాణంలో అత్యధిక భాగం ఖాళీగా వుండిపోయి నేడు శిధిలావస్థకు చేరిన అనుభవం నుండి కూడా పాలకులు నేర్చుకునేందుకు పూనుకోకపోవటమే ఇవి ప్రదర్శనాత్మక చర్యలని రుజువు చేస్తున్నది.

రియల్ ఎస్టేటు ధరలు విపరీతంగా పెరగటంతో గృహాలలో మదుపు లాభదాయకంగా మారింది. ధనాఢ్య వర్గాలు వీటిని కొనటం పెరిగింది. బొంబాయి మహానగరంలో యిళ్ల కొరత 20 శాతముండగా, సగం నిర్మితగృహాలు ఖాళీగానే (అద్దెకు కూడా యివ్వకుండా) వుంటున్నాయని ఇటీవల సర్వేలో బయట పడింది. ధనాఢ్య వర్గాలు ఇళ్లుకొని అట్టిపెట్టుకునే మదుపుగా దాని విలువ పెరగటాన్నే చూస్తున్నారుగానీ దాని నుండి ఆదాయాన్ని కూడా ఆశించటంలేదు. దీని కోసం ప్రభుత్వం రెంటుకంట్రోలు చట్టాన్ని సవరించినా పరిస్థితి మారలేదని ఆ సర్వే తెలిపింది.

ప్రజల కనీస అవసరాలైన గృహవసతిని కల్పించని ప్రభుత్వం గృహనిర్మాణాన్ని పరిశ్రమ స్థాయికి పెంచి ఆదాయవనరుగా చూడటంతో సాగుభూములు పడావు పడుతుండగా, పేద మధ్యతరగతులకు ఇళ్లు తీరనికలగానే మిగిలిపోతున్నది. ఎంతో కొంత స్వంత స్థలం వున్న గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వమిచ్చిన అరకొర సాయంతోనే ప్రజలు ఇళ్లు పూర్తి చేసుకోగలిగారన్న వాస్తవం సరైన పథక రచన, అమలువుంటే గృహవసతి కల్పన అసాధ్యం కాదని తెలుపుతున్నది. కాగా ప్రజలను నిత్యం సహాయంకోసం ఎదురుచూసే స్థితిలో వుంచే పాలకుల విధానాలతో గృహవసతి ఏనాటికీ తీరదు. ✡

# అమెరికా సామ్రాజ్యవాదం విద్యారుణాల సంక్షోభం

**కొన్ని** సంవత్సరాల క్రితం గృహ రుణాల సంక్షోభం అమెరికా ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. లక్షలాది శ్రామిక కుటుంబాలను ఇళ్లనుండి గెంటివేసింది. ఇప్పుడు కాలేజి విద్యార్థుల చదువుల కొరకు యిస్తున్న విద్యారుణాలు సంక్షోభ స్థితికి చేరాయి. యువత భవితవ్యాన్ని చీకటిమయం చేస్తున్నాయి.

ఫెడరల్ రిజర్వుబ్యాంకు ఆఫ్ న్యూయార్క్ రూపొందించిన నివేదిక ప్రకారం కాలేజీ విద్యనభ్యసించేందుకు బ్యాంకుల నుండి తీసుకున్న విద్యారుణాలను విద్యార్థులలో నాల్గవవంతు మంది తిరిగి చెల్లించలేక పోతున్నారు; ఈ రుణాలను వసూలు చేసేందుకు బ్యాంకులు దయలేని కఠిన పద్ధతులను వాడుతున్నాయని నివేదిక తెలిపింది.

అమెరికా విద్యారుణాల మొత్తం కొండలా పెరిగిపోయి 87,000 కోట్ల డాలర్లకు చేరింది. ఇది కార్ల కొనుగోళ్లకిస్తున్న రుణాలనూ (73వేల కోట్లడాలర్లు) క్రెడిట్ కార్డులపై ఇస్తున్న రుణాలనూ (69 వేల కోట్ల డాలర్లు) మించిపోయింది. అమెరికాలో దాదాపు 80 శాతం మందికి క్రెడిట్ కార్డులుంటాయి. అలాగే 80 శాతం కుటుంబాలకు కార్లుంటాయి. కనుక వీటికిచ్చే రుణం తలసరిన తక్కువవుంటుంది. కాగా విద్యారుణాలు తీసుకుంటున్న విద్యార్థులు జనాభాలో సగటున 15 శాతం మంది మాత్రమే. వారుకూడా శ్రామిక కుటుంబాలకు చెందినవారే. కనుక విద్యారుణభారం తలసరిన ఎక్కువుంటుంది. తలసరి సగటు విద్యారుణం 23,300 డాలర్లుగావుంది. రూపాయలలో చెబితే దాదాపు 11 లక్షలు.

ప్రతి ఏడాదీ ఫీజులు పెరిగి పోతుండటంతో విద్యార్థులపై రుణభారం కూడా పెరిగిపోతూ వస్తున్నది. 2006 సంవత్సరంలో పట్టభద్రుడైన విద్యార్థులు తీసుకున్న సగటు రుణం 19,646 డాలర్లు కాగా, 2010లో పట్టభద్రులైన వారి సగటురుణం 29 శాతం పెరిగి 25,530 డాలర్లు అయింది. అదే కాలంలో పార్టుటైము ఉద్యోగాలు చేసే కాలేజీ విద్యార్థుల వేతనాలు తగ్గిపోతున్నాయి. 23 నుండి 29 ఏళ్ల మధ్య వయసున్న మగ కాలేజీ విద్యార్థులకు గంటల లెక్కన యిచ్చే వేతనాలు గత పదేళ్లలో 11 శాతం తగ్గాయని ఇకనామిక్ పాలసీ ఇన్‌స్టిట్యూటు తెలిపింది. డిగ్రీలేని మగ విద్యార్థుల వేతనాలు 25 శాతం తగ్గాయని తెలిపింది.

కాలేజీ విద్య పూర్తి చేసుకున్న యువతకున్న ఉపాధి అవకాశాలు నానాటికీ తరిగి పోతుండటంతో, ఒక మొత్తం తరానికి చెందిన యువత రుణభారం క్రింద నలిగి పోతున్నది. వారి భవిష్యత్తు బ్యాంకుల తాకట్టులో వుంది. అవి విద్యారుణాలపై వందలకోట్ల డాలర్ల లాభాలను పిండుకుంటున్నాయి. గౌరవప్రదమైన, భద్రతలగల ఉద్యోగం లభించే ఆశ ఏమాత్రం లేని యువత పరిస్థితి "గత కాలపు బంధిత కూలీల దుస్థితిని గుర్తుకుతెస్తున్నద"ని వామపక్ష వ్యాఖ్యాత ఆండ్రి డామన్ అన్నారు. ఇది శ్రామికవర్గాన్ని అణచివుంచే విప్లవ ప్రతీఘాత చర్యేనని ఆయన వ్యాఖ్యానించారు.

విద్యారుణాల భారాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటానని అధ్యక్ష ఎన్నికల సమయంలో ఒబామా వాగ్దానం చేశారు. అయినా చేసిందేమీలేదు. మళ్లీ ఎన్నికలు దగ్గర పడటంతో ఒక నామమాత్రపు చర్యను తీసుకున్నారు. రుణ గ్రహీత ఆదాయం ఆధారంగా చెల్లించేకిస్తీ 15 శాతంగా వున్నదానిని 10 శాతానికి తగ్గించారు. అయితే ఇది ప్రభుత్వ సంస్థల నుండి రుణం తీసుకున్న వారికే వర్తిస్తుంది. బ్యాంకు రుణాలకు వర్తించదు. ఆ విధంగా ఆత్యధిక విద్యార్థులకు వర్తించదు. అంతేకాక, విద్యార్థులకు ప్రభుత్వమిచ్చే ఆర్థిక సహాయాన్ని తగ్గిస్తూవస్తున్నారు. దీనిని పెంచేందుకు గానీ, లేదా కనీసంగా ఇంకముందుకన్నా తగ్గించకుండా వుండేందుకుగానీ ఒబామా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

కోట్లాది యువతకు నిరుద్యోగాన్నీ, అతితక్కువ వేతన తాత్కాలిక ఉద్యోగాన్ని తప్ప మరేమీయివ్వలేని సామాజిక వ్యవస్థ, అంతంలేని యుద్ధాలలో ప్రాణాలు కోల్పోవడం, వికలాంగులవటమే తప్ప మరోదారి చూపని వ్యవస్థ, అదేమంటే దారుణ అణచివేతను యిచ్చే వ్యవస్థ-వైఫల్యం చెందిన వ్యవస్థ అవుతుంది. అదే పెట్టుబడిదారీ వ్యవస్థ. అది శ్రామిక వర్గాలకు చెందిన యువత ఆశలనూ, కలలనూ ధ్వంసం చేసింది. సుందర భవిష్యత్తును సొంతం చేసుకునేందుకు పోరాడే యువజనులు కార్మికవర్గంతో చేతులుకలిపి సోషలిస్టు వ్యవస్థను సాధించేందుకు ముందుకు సాగాలి. ✡

# విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని ఆందోళన



బందరులో ధర్నా




గుంటూరులో ప్రదర్శన

**బందరు, 2-4-12 :**

రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తున్న విద్యుత్ ఛార్జీల పెంపు భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఏఐఎఫ్‌టియు (న్యూ) సంస్థల ఆధ్వర్యంలో బందరు కలక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ వై. సోనీ మాట్లాడుతూ నెలకు 100 యూనిట్లు విద్యుత్ వాడుకునే వారు ఇక నుండి నెలకు రు. 2.60 పై. చెల్లించాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అటకెక్కి నిర్ణీత కాలవ్యవధి తర్వాత యూనిట్‌కు3.25 చెల్లించాలని; ఎత్తిపోతల పథకాల క్రింద ప్రతి యూనిట్‌కు 3.50 చెల్లించాలనీ, కాగా బడాపారిశ్రామిక, వ్యాపారవేత్తలకు వేల కోట్ల రూపాయలు ప్రోత్సహకాలనిస్తున్న ప్రభుత్వం, రాయితీలను కల్పిస్తున్న ప్రభుత్వం సామాన్య ప్రజానీకాన్ని మాత్రం అంతులేకుండా దోపిడీకి గురిచేస్తున్నాయని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు సాగినప్పుడే వీటిని నిలువరించగలుగతామన్నారు.

ఇంకా, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్, అంజమ్మ; ఎఐఎఫ్‌టియు నాయకులు బెల్లంకొండ రవి, ఎన్‌వైఎస్ నాయకులు జి. మల్లేష్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు నాగమణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**గుంటూరు, 31-3-12**

విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన మార్కెట్ సెంటర్ నుండి బయలుదేరి జిన్నాటవర్ సెంటర్ మీదుగా పల్నాడు బస్టాండు సెంటర్ చేరుకుంది. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన పెట్రోల్. డీజిల్, వంట గ్యాస్ ధరలకు తోడు, నిత్యావసర ధరలకు తోడు విద్యుత్ ఛార్జీల పెంపుదల సామాన్య, మధ్యతరగతి ప్రజల్ని సైతం తీవ్రంగా కలిచివేస్తున్నదని, ఈ భారాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు నాయకులు గిడుతూరి చంద్రం, ప్రజాకళాకారులు కాట్రగడ్డ హనుమంతరావు, సూర్యచంద్రరావు, ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**ఒంగోలు, 31-3-12**

పెంచిన విద్యుత్ ఛార్జీల భారాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో స్థానిక ఈమనిపాలెంలోని పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ప్రదర్శన కలెక్టర్ కార్యాలయం, బస్టాండ్ మీదుగా చర్చిసెంటర్ చేరుకొన్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యస్. లలితకుమారి మాట్లాడుతూ ముడిచమురు ధరలు పెరిగాయనే కారణం చూపి 3,4 సార్లకుపైగా ఇటీవలికాలంలోనే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచివేశారని; విద్యుత్ ఛార్జీలను గతమూడు సంవత్సరాల నుండి వరుసగా 1400 కోట్లు; 641 కోట్లు; తిరిగి ఇపుడు 4441 కోట్లు పెంచటం దారుణమని; ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తున్న పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై సమైక్యపోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥ ఎమ్.ఎస్. శాయి, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ పరిటాల కోటేశ్వరరావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా అధ్యక్షులు కా॥ టి. రేణుక తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరి, 31-3-12 :**

విద్యుత్‌ఛార్జీలపెంపును వెంటనే ఉపసహరించాలని డిమాడ్ చేస్తూ స్థానిక ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓ సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థి యువకులు వినూత్నంగా కిరోసిన్ దీపాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎలుగెత్తి నిరసించారు.

ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు కా॥ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు విద్యుత్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా వామపక్షాలతో కలసి చంద్రబాబుపై పోరాడిన కాంగ్రేసుపార్టీ, అధికారంలోకి వచ్చాక అదే విధానాలను అనుసరిస్తున్నదన్నారు, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని విద్యార్థి యువకులుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకా పిడియస్‌ఓ జిల్లా అధ్యక్షుడు కా॥ షేక్ బాజీసైదా; శివాజిరాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. ★

# పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థుల మెస్ సమస్యపై ఆందోళన

**గుంటూరు, 2-4-12 :**

పాలిటెక్నిక్ మరియు ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి గృహాలలో నిలిపివేసిన భోజన వసతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ నుండి కలెక్టర్ బంగ్లావరకు 'ఆకలియాత్ర' నిర్వహించారు. హాస్టల్స్‌లో భోజన వసతి పునరుద్ధరించటంతో పాటు, స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను అందరికీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు, సాంఘిక సంక్షేమ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు.

పిడిఎస్‌ఓ జిల్లా నాయకులు కా॥ బాజీసైదా ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మార్చి నెలాఖరు వరకు మాత్రమేగాకుండా మే నెలాఖరు వరకు వసతి, భోజన సౌకర్యం కల్పించ వలసివుండగా, ప్రభుత్వాధికార్లు నిరాకరిస్తున్నారని, వీటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కా॥ నాగబసవయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అధికారులను నిలవేశారు. ★

## వివిధ ప్రపంచ... (చివరి పేజీ నుండి)

### దక్షిణ మధ్య రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమ్మె

దక్షిణమధ్య రైల్వేకు అనుబంధంగావున్న సహకార సొసైటీలలో పనిచేసే వందలాది మంది కాంట్రాక్టు కార్మికులు జనవరి 20వ తేదీ నుండి చెన్నైలోని రైల్వే కోపరేటివ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఎదుట వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ నిరసన, ధర్నాలు నిర్వహించారు.

### బొబ్బిలి మిల్లు కార్మికుల నిరసన

మిలికో ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో విజయనగరం జిల్లా-బొబ్బిలి తహశీల్‌దారు కార్యాలయం ఎదుట ఫిబ్రవరి 1న ధర్నా చేపట్టారు. కంపెనీ తన ఉత్పత్తి విభాగాన్ని మూసివేసి మిథనాల్‌ను దిగుమతి చేసుకోవాలనే నిర్ణయాన్ని వీరు వ్యతిరేకించారు. కంపెనీ తయారీ యూనిట్‌కు యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించింది. ★

# కామ్రేడ్ కానూసన్యాల్ వర్ధంతి సభ



ఒంగోలులో వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ స్వామి



అనంతపురం-వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥సి. పెద్దన్న

**ఒంగోలు, 29-3-12 :**

భారతవిప్లవోద్యమ అగ్రనేత, నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కా॥ కానూసన్యాల్ రెండవ వర్ధంతి సభ స్థానిక వేమూరి లక్ష్మణ కళ్యాణ మండపంలో సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సభకు అధ్యక్షత వహించిన సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యస్. లలితకుమారి మాట్లాడుతూ భారత జాతీయోద్యమ అమరవీరుడు కా॥ భగత్‌సింగ్‌ను ఉరితీసిన రోజునే కా॥ కానూసన్యాల్ మరణించారని, ప్రజాయుద్ధపంథాను సిద్ధాంత, ఆచరణ రంగాల్లో ఎత్తిపట్టి ముందుకు సాగారని పేర్కొన్నారు.

ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో పొడచూపిన మితవాద, అతివాద, ఆవకాశవాద పెడ ధోరణులను కా॥ కానూసన్యాల్ ధీటుగా ఎదుర్కొన్నారని; నగ్జల్బరీ ఉద్యమాన్ని తెలంగాణా రైతాంగ సాయుధపోరాట కొనసాగింపుగా మాత్రమే పేర్కొనేవారని, నగ్జల్బరీ పోరాటం భూమి సమస్యను తిరిగి మరోసారి ఎజెండాపైకి తీసుకువచ్చిందనీ, మన రాష్ట్రంలో 1969 నాటికి శ్రీకాకుళ గిరిజనోద్యమం చారుమజుందార్ అతివాద విధానాల అమలు కారణంగా తీవ్రంగా నష్టాలను చవిచూసిందనీ పేర్కొంటూ విప్లవకారుల ఐక్యతను ముందుకు తీసుకువెళ్లటమే కా॥ కె.ఎస్.కు అర్పించే నివాళిగా పేర్కొన్నారు.

ఇంకా ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కా॥ఎం.ఎస్. శాయి; రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు వి. రామారావు; కోటేశ్వరరావు, పేరయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**అనంతపురం 10-4-12 :**

విప్లవ యోధుడు, అమరుడు కా॥ కానూసన్యాల్ ద్వితీయ వర్ధంతి సభను సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో స్థానిక మండ్ల సుబ్బారెడ్డినగర్‌లో నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఈ సభకు సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ పెద్దన్న అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా కామ్రేడ్ కానూసన్యాల్ అనంతపురం వచ్చిన సందర్భాన్ని గుర్తుచేశారు. సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను వివరించి ప్రజలను కర్తవ్యోన్ముఖుల్ని చేయటంలో, ఉత్తేజకర ప్రసంగాలు చేయటంలో కా॥ కె.ఎస్. ఆయనకు ఆయనే సాటి అని పేర్కొన్నారు.

ఈ వర్ధంతి సభలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ బి. తిమ్మారెడ్డి, ఎన్‌వైఎస్ రాష్ట్ర కోశాధికారి కా॥ ఎల్ లక్ష్మిరెడ్డి, ఎఐఎఫ్‌టియు నగర నాయకులు కా॥ సుధాకర్ తదితరులు పాల్గొని కా॥ కె.ఎస్.కు ఘననివాళులర్పించారు. బాలకళాకారులు అమరులను స్మరిస్తూ పాటలు పాడారు. ★

# కా॥ జొన్నా కోటయ్య అంతిమయాత్ర-సంతాపసభ





కా॥ జొన్నా కోటయ్య సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కా॥ జి. విజయకుమార్; సభకు హాజరైన ప్రజానీకం

**25-3-12** రాత్రి స్వల్ప అస్వస్థత అనంతరం నెల్లూరు ఆసుపత్రిలో చనిపోయిన తొలితరం కమ్యూనిస్టు యోధుడు కా॥ జొన్నా కోటయ్య అంత్యక్రియలు మర్నాడు ఆయన స్వగ్రామం తలమంచిలో జరిగాయి. కా॥కోటయ్య మృతదేహానికి బంధువులతో పాటు వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు నివాళులర్పించారు. సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥ జె. కిశోర్‌బాబు అధ్యక్షతన జరిగిన సంతాపసభలో సిపిఐ (ఎం) నాయకులు జక్కా వెంకయ్య, సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్రనాయకులు గుర్రం విజయకుమార్, సిపిఐ నాయకులు సముజుల దశరథరామయ్య, న్యూడెమోక్రసి నాయకులు సాగర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పులి రామకృష్ణయ్య, రామచంద్రారెడ్డి హాస్పటల్ నుండి ఎన్.దశరథ రామయ్యలు మాట్లాడారు. అనంతరం ఆయన మృతదేహాన్ని ప్రదర్శనగా తీసుకెళ్ళి గ్రామ స్మశానవాటికలో దహనం చేశారు.

### తలమంచిలో సంస్మరణ సభ

సిపిఐ (ఎం.ఎల్), సి.పి.ఐ (ఎం), సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమోక్రసిల ఆధ్వర్యంలో 4-4-12న సంస్మరణ సభ జరిగింది. సభకు రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥జి.సునీత అధ్యక్షత వహించారు. సభలో తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వి.రామరాజు, సి.పి.ఐ(ఎం) నాయకులు గోనె దయాకర్, న్యూడెమోక్రసి నాయకులు సాగర్‌లు మాట్లాడారు. సిపిఐ(ఎం.ఎల్) నాయకులు జె.కిశోర్‌బాబు మాట్లాడుతూ 17 సం॥ల వయసు నుండే మొదలైన కా॥ కోటయ్య రాజకీయ జీవితపు వివిధ ఘట్టాలను - తరిమెల నాగిరెడ్డి కుట్రకేసులో ముద్దాయిగా నాలుగున్నర సంవత్సారాల జైలు జీవితం గడపటాన్ని గుర్తు చేశారు. చిట్టచివరి వరకు మార్క్సిస్టు-లెనినిస్టు మౌలిక సూత్రాల మీద విశ్వాసంతో ప్రజావుద్యమాలకు చేదోడుగా నిలబడ్డ విషయాలను స్మరించుకున్నారు.

### నెల్లూరులో సంస్మరణ సభ

5-4-12న నెల్లూరు వర్ధమాన సమాజ గ్రంథాలయ మిద్దెమీద సంస్మరణ సభను సి.పి.ఐ(ఎం.ఎల్) నిర్వహించింది. ఈ సభకు కా॥జె.కిశోర్‌బాబు అధ్యక్షత వహించగా సి.పి.ఐ రాష్ట్ర నాయకులు సముజుల దశరథరామయ్య, సి.పి.యం. నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ తొలితరపు కమ్యూనిస్టు నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య, బస్వారెడ్డి శంకరయ్య తదితరుల నాయకత్వంలో జిల్లాలో సాగిన వుద్యమంలోకి వచ్చిన జొన్నా కోటయ్య, కమ్యూనిస్టు ఉద్యమంలో సాగించిన కృషిని-పార్టీలో విభేదాలు తలెత్తిన సందర్భంలో ఆయన మితవాద, అతివాద రాజకీయాలకు వ్యతిరేకంగా తీసుకున్న సూత్రబద్ధవైఖరులను గుర్తుచేశారు. ఐక్య ఉద్యమపు ఆవశ్యకత ఆకాంక్షను సఫలం చేయాలన్నారు. ★

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# వివిధ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనా కార్యక్రమాలు

## ఐర్లాండ్ — ఫ్యాక్టరీని స్వాధీన పరచుకున్న 'విటాకోర్టెక్స్' కార్మికులు

2011 డిసెంబర్ 16న ఐర్లాండ్ దేశం–కోర్క్‌లోని విటా కార్టెక్స్ పరిశ్రమను32 మంది ఆ పరిశ్రమకు చెందిన కార్మికులు, ఏ మాత్రం సరిపడని తమ వేతనాల పెంపుదలను డిమాండ్ చేస్తూ స్వాధీనంలోకి తీసుకున్నారు. 2011 సెప్టెంబరులో యాజమాన్యం వాగ్దానం చేసిన విధంగా తమకు చెల్లించవలసిన 12 లక్షల యూరోల చెల్లింపును డిమాండ్ చేస్తున్న కార్మికులకు మద్దతుగా 2012 జనవరి 2న సుమారు 500 మంది ప్రజలు సమీకృతులై ప్రదర్శన – ధర్నాలు నిర్వహించారు. కార్క్ నుండీ వెస్ట్‌మీత్ కౌంటీలోని ఆథోలీన్‌కు ఉత్పత్తిని తరలించే క్రమంలో జనవరి 30వ తేదీన ఫ్యాక్టరీ యాజమాని జాకీరోనన్ ఇంటిఎదుట కార్మికులు తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ఈజిప్టు — అవినీతికి వ్యతిరేకంగా కైరోలో కార్మికుల ప్రదర్శన

2012 జనవరి ఒకటో తేదీన కైరోలోని నాసర్ నగరంలో తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వరంగ పరిశ్రమల, ప్రభుత్వ సంస్థలకు చెందిన వందలాది మంది సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. అవినీతి నాయకులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

## మెక్సికో — పదవీ విరమణ నిధిని తిరిగి చెల్లించాలని ప్రభుత్వ కార్మికుల ఆందోళన

మెక్సికోలోని మిచకాన్‌లో ప్రభుత్వ కార్మికులు 7500 మంది జనవరి 5న తమ పనిని 8 గంటలపాటు నిలుపుదల చేశారు. తమకు రావలసిన 150 కోట్ల పెసోలను తిరిగి ప్రభుత్వ పదవీ విరమణ నిధికి జమ చేయాలనివారు డిమాండ్ చేశారు.

ఒయాక్సికాలోని ప్రభుత్వ భద్రతా సచివాలయానికి చెందిన 9000 మంది కార్మికులు ఫిబ్రవరి 20 నుండి 3 రోజులపాటు సమ్మె చేపట్టారు. రాష్ట్ర పోలీసు విభాగంలోని నలుగురు ఉన్నతస్థాయి అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెల సాధనలో భాగంగా యస్‌యస్‌సి కార్యాలయాన్ని చుట్టుముట్టిన 50 మంది కార్మికులను రాష్ట్ర పోలీసులు అక్కడినుండి తొలగించారు.

## కొలంబియా — పెట్రోలియం పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

జనవరి 11న రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే 500 మంది లాసిఫ్రా పెట్రోలియం కంపెనీ కార్మికులు సమ్మె చేపట్టి, కాంట్రాక్టు కార్మికుల తీవ్రమైన అభద్రతను నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. పోలీసులు ఆందోళనకారులపై విరుచుకుపడి ఆరుగురు కార్మికులను గాయపరిచారు. ఏడుగురిని అరెస్టు చేశారు.

## శ్రీలంక — అధిక పనిభారాలకు వ్యతిరేకంగా టీ తోట కార్మికుల సమ్మె

జనవరి 10 నుండి వాటావాలా టీ తోట కంపెనీకి చెందిన 1200 మంది కార్మికులు సమ్మెచేపట్టారు. ప్రతి కార్మికుడు రోజుకు 3 కేజీల ఉత్పత్తి స్థానంలో 17 నుండి 20 కేజీల ఉత్పత్తి తీయాలని పనిభారాన్ని పెంచటాన్ని; అతి తక్కువ పెంపుదలతో కొత్తగా రూపొందించిన వేతనాలను నిరాకరిస్తూ వారు ఈ సమ్మె చేపట్టారు.

## దక్షిణకొరియా — హ్యూండాయ్ కార్మికుల సమ్మె

జనవరి 10న దక్షిణకొరియా–ఉల్సాన్‌లోని 5వ హ్యూండాయ్ మోటార్ ఇంజన్ పరిశ్రమకు చెందిన 2 వేల మంది కార్మికులు ఒకరోజు నిరసన సమ్మె చేపట్టారు. చిన్ అనే ఒక 44 సం॥ల కార్మికుడు, పై అధికారుల వేధింపులను భరించలేక ఆత్మహత్యకు పూనుకున్నాడు. దీనికి కారణమైన యాజమాన్య నిర్లక్ష్య విధానాలను నిరసిస్తూ వారు సమ్మె కార్యక్రమం చేపట్టారు. హ్యూండాయ్ యాజమాన్యం అధికారికంగా క్షమాపణలు చెప్పటానికి; కార్మికుని ఆత్మహత్యా ప్రయత్నానికి బాధ్యులైన వారిని శిక్షించటానికి;కార్మికుడు చిన్‌కు నష్టపరిహారం చెల్లించటానికి అంగీకరించడంతో కార్మికులు తిరిగి పనులలోకి వెళ్ళారు.

## నైజీరియా — పెట్రోల్ ధరల తగ్గింపుకై సాధారణ సమ్మె

నైజీరియాలో జనవరి 9 నుండి 16 వరకు ప్రజానీకపు దేశవ్యాపిత సాధారణ సమ్మె జరిగింది. దీనిలో ప్రజలు, కార్మికులు పాల్గొని ఇంధనాలపై ప్రభుత్వ సబ్సిడీల కోతలను నిరసించారు. ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నైజీరియా అధ్యక్షుడు చివరికి దిగివచ్చి పెట్రోల్ ధరల తగ్గింపుకు అంగీకరించడంతో సాధారణ సమ్మె ముగిసింది.

## చైనా — కార్మికుల సమ్మెల పరంపర

జనవరి 3న ఫాక్స్‌కాన్ కంపెనీకి చెందిన కార్మికులు తమ ఉద్యోగ బదిలీల వివాదమై పదుల సంఖ్యలో ఫ్యాక్టరీ పైకి ఎక్కి అక్కడి నుండి దుమికి మరణిస్తామని బెదిరించారు. ఫాక్స్‌కాన్ కంపెనీ యాజమాన్యం వూహాన్‌లోని మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్–360 నమూనా తయారీని తమ ప్లాంటులో నిలిపివేసి కార్మికులను ఇతర ఉద్యోగాలలోకి బదిలీ చేసింది. మొదటగా ఫాక్స్‌కాన్ యాజమాన్యపు బదిలీ ఉత్తర్వులను అంగీకరించకుండా ఉద్యోగాన్ని వదులుకునేందుకు సిద్ధమైన కార్మికులకు, వారికి రావలసిన డబ్బును చెల్లిస్తామని ప్రతిపాదించి కూడా ఆపై యాజమాన్యం దాని నుండి వైదొలగింది.

ఫిబ్రవరి 14న షాంగ్జీ రాష్ట్రం – హాంగ్ ఝూంగ్ స్టీల్ పరిశ్రమలోని 5 వేల మంది కార్మికులు మౌలిక అవసరాల ధరల పెరుగుదలకనుగుణంగా తమ వేతన పెంపుదలను డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టారు.

ఫిబ్రవరి 14ననే షాంగైలోని జర్మనీకి చెందిన సైమన్స్ స్విచ్‌గేర్‌లోని 600 మంది కార్మికులు సమ్మె చేశారు. తమ తోటి కార్మికులు నలుగురిని ఉద్యోగాలనుండి తొలగించి వేయటంతో వారు సమ్మె చేపట్టారు. మరునాడు కార్మికులు పనిలోకి రాకుంటే, పనులు నిలుపుదల చేయటాన్ని గైరు హాజరుగా పరిగణిస్తామని యాజమాన్యం బెదిరింపులు సాగించింది. దీనికి ఆగ్రహించిన కార్మికులు నిరసనగా ఫ్యాక్టరీ ద్వారాలను దిగ్బంధం చేశారు.

ఫిబ్రవరి 17,18 తేదీలలో ఫ్యాక్స్‌కాన్ నింగ్‌బో పరిశ్రమ సముదాయంలోని 4 యూనిట్లకు చెందిన వందలాది కార్మికులు–చైనా నూతన సంవత్సరం సందర్భంగా పనిచేసిన సమయానికి తగిన పరిహారాన్ని చెల్లించనందుకు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల చేత గంటల లెక్కన ఇక్కడ పని చేయించుకొంటూ వేతనాలు చెల్లిస్తున్నారు. ఫ్యాక్స్‌కాన్ యాజమాన్యం పనిభారాలను పెంచుతూ కార్మికులచే రోజుకు 12 గంటల దాకా పనిచేయిస్తున్నది.

ఫిబ్రవరి 20వ తేదీన–షోక్సింగ్ నగరంలో తైవాన్‌కు చెందిన స్పోర్టు షూ ఫ్యాక్టరీలో వేయిమంది కార్మికులు ప్రధాన జాతీయ రహదారిని దిగ్బంధించారు–మరొకపెద్ద ఫ్యాక్టరీతో ఈ ఫ్యాక్టరీని కలిపివేస్తున్న సందర్భంగా కార్మికులకు చెల్లించవలసిన పరిహారం తగ్గింపుపట్ల నిరసనగా వారు ఈ కార్యక్రమం చేపట్టారు.

ఫిబ్రవరి 23న–హ్యూఝూలోని అమెరికాకు చెందిన మెరిక్స్ కార్పొరేషన్‌లో పనిచేసే షుమారు వెయ్యి మంది కార్మికులు తమ వార్షిక బోనస్‌లో 25 శాతం కోత విధింపుకు నిరసనగా సమ్మెలోకి వెళ్ళారు. వీరు 'బోష్' వంటి కంపెనీలకు అవసరమైన సర్క్యూట్ బోర్డులను తయారుచేస్తారు.

## స్పెయిన్ — నూతన కార్మిక చట్టానికి పెద్దఎత్తున నిరసనలు

ఫిబ్రవరి 19న వందల, వేల మంది కార్మికులు ప్రభుత్వ నూతన కార్మిక చట్టాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ చట్టం ఉత్పాదకత లేదా పోటీ పేరుతో ఏకపక్షంగా కార్మికుల వేతనాలను తగ్గించేందుకు యాజమాన్యాలకు అధికారాలను కల్పిస్తున్నది. మాడ్రిడ్‌లో 10 వేలమంది కార్మికులు వీధులలోకి రాగా, బార్సిలోనాలో 1,00,000 మంది నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. సరగోస్సా, గిజాన్, సెవిల్లే గెరోనా, మార్సియా, లియోన్, టాలెడో, పామ్‌టోనా, టారగోనాలలో ధర్నాలు ప్రదర్శనలు జరిగాయి.

ఫిబ్రవరి 23న వందల, వేలమంది నిరసనకారులు వీధుల్లోకి వచ్చి, విద్య, వైద్యం, తదితరాలకు వెచ్చించే ప్రభుత్వ ఖర్చులో కోత విధించటాన్ని నిరసించారు. అలికాంటే, కోస్టలియోన్, వలెన్సియా నగరాలలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలను నిర్వహించారు.

## ఈజిప్టు — మెరుగైన వేతనాలకై గవర్నర్‌కు విజ్ఞాపన

జనవరి 31న లక్సార్ క్లీనింగ్ అథారిటీకి చెందిన వందలాది కార్మికులు తమ మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ రహదార్లు అడ్డగించి గవర్నర్ ప్రధాన కార్యాలయాన్ని మూసివేశారు.

## దక్షిణ ఆఫ్రికా — ప్లాటినమ్ గని కార్మికుల సమ్మె

ఫిబ్రవరి మొదటి వారంలో షుమారు 5000 మంది రాయిని తొలచే గని కార్మికులు రుస్సెన్‌బర్గ్‌లోని ఇంపాలా ప్లాటినమ్ గనివద్ద సమ్మె చేశారు. సిబ్బందికి చెల్లించే సాంవత్సరిక వ్యయాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా గనులు తొలిచే కార్మికుల బోనస్‌ను నిలుపుదల చేసినందుకు వారు నిరసన తెలియజేశారు.

ఫిబ్రవరి 6న 25 వేలమంది గని కార్మికులు, తమ పనులు బహిష్కరించి రాళ్ళను తొలగించే కార్మికులకు మద్దతుగా నిలిచారు. రాతిని తొలిచే కార్మికులకు మద్దతుగా నిలిచిన 13 వేల మంది కార్మికులను యాజమాన్యం ఒక్కసారిగా తొలగించింది. ఒక రోజులో జరగవలసిన 3 వేల ఔన్సుల ప్లాటినం ఉత్పత్తి నిలిచిపోయింది. ఒక ఔన్సు ప్లాటినం ప్రస్తుత ధర దాదాపు 75 వేల రూపాయలు.

## ఫ్రాన్స్ — సమ్మె బిల్లును వ్యతిరేకిస్తూ ఎయిర్ ఫ్రాన్స్ కార్మికుల సమ్మె

సౌతాఫ్రికాలోని–ఎయిర్ ఫ్రాన్స్‌కు చెందిన పైలెట్లు, క్యాబిన్ సిబ్బంది, ఇతర కార్మికులు ఫిబ్రవరి 6 నుండి 4 రోజులు సమ్మె చేశారు. 48 గంటల ముందుగా సమ్మె నోటీసు ఇచ్చి మాత్రమే కార్మికులు సమ్మెలోకి వెళ్ళాలనే నిబంధనతో కూడిన బిల్లు ఫ్రెంచ్ సెనేట్ ముందుకు రోబోతున్న సందర్భంగా వారీ సమ్మెచేశారు.

## ఈజిప్టు — సుకారీ బంగారుగనుల కార్మికుల సమ్మె

12 గంటల షిఫ్టుల బదులు 8 గంటల షిఫ్టులను డిమాండ్ చేస్తూ రెడ్‌సీ నగరంలోని సుకారీ బంగారు గనిలోనూ; ఈజిప్టులోని మార్సా ఆలమ్‌లోనూ జనవరి నుండి సమ్మె సాగిస్తున్నారు. పూర్తి కాలపు ఒప్పందాలను, సురక్షిత పని పరిస్థితులను, ఆరోగ్యబీమాను, ప్రాజెక్టుకు దగ్గరలో సబ్సిడీ ధరకే ఇళ్ళ నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## ఇజ్రాయిల్ — కాంట్రాక్టు కార్మికుల సార్వత్రిక సమ్మె

ఫిబ్రవరి 1న పదిలక్షల మంది ఇజ్రాయిలీ ప్రజలు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, తమ హక్కులను డిమాండ్ చేస్తూ సార్వత్రిక సమ్మెను నిర్వహించారు.

## బెహరైన్ — ఇండియా, బంగ్లా కార్మికుల సమ్మె

బెహ్రైన్‌లోని ఆస్కార్ నిర్మాణ కంపెనీకి చెందిన 500 మంది ఆసియా కార్మికులు మెరుగైన వేతనాలను కోరుతూ ఫిబ్రవరి రెండవవారంలో సమ్మెచేశారు.

500 మందికి పైగా కార్మికులు భామిన్ క్యాంప్‌వద్ద, 200 మంది సల్మాబాద్ క్యాంప్‌వద్ద విడివిడిగా సమ్మె చేపట్టారు. ఈ రెండు నిర్మాణ ప్రాంతాలూ ఒకే కంపెనీ ఆధ్వర్యంలో నిర్మాణమౌతున్నాయి.

## ఆస్ట్రేలియా — బొగ్గు కార్మికుల సమ్మె

క్వీన్స్‌లాండ్‌లోని 7బిహెచ్‌పి–బిల్లిటన్, మిత్సుభిషి అలయెన్స్‌బొగ్గు గనులకు చెందిన 4 వేల మంది గని కార్మికులు ఫిబ్రవరి 15 నుండి సమ్మె చేపట్టారు. 12 గంటల షిఫ్టులో ప్రస్తుతం ఇస్తున్న రెండుసార్ల విరామం స్థానంలో 3 సార్లు విరామం కావాలని, కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టర్లు తొలగించిన స్థిర కార్మికులకు రక్షణ, వార్ధక్యపరిమితి పెంపుదల; మెరుగైన గృహవసతి, ప్రస్తుత ఆరోగ్య భద్రతా పరిస్థితుల నిర్వహణ మెరుగుదలలను వారు డిమాండ్ చేశారు.

## ఇటలీ — ట్రక్కు, టాక్సీ డ్రైవర్ల సమ్మె

కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు జనవరి 24న దేశ వ్యాపిత సమ్మె చేయటం ద్వారా ఇటలీలోని రవాణా వ్యవస్థను స్తంభింప చేశారు.

## చిలీ — పోర్టు కార్మికుల సమ్మె

చిలీలోని పోర్టు కార్మికులు జనవరి 30న సమ్మె చేశారు. వీరు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. పోర్టు కార్మికుల సమ్మెకు చిలీ విద్యార్థి ఫెడరేషన్ తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది.

## నైజీరియా — డెల్టా ఉక్కు కర్మాగార కార్మికుల సమ్మె

ప్రమోద్ మిట్టల్ నిర్వహిస్తున్న నైజీరియాలోని డెల్టా స్టీల్ కంపెనీలో పనిచేస్తున్న 117 మంది ఉద్యోగులకు గత కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకుండా వుండటంతో వారు ఆహార కొరత నెదుర్కొంటున్నారు. నీరు, విద్యుత్‌లు బందయ్యాయి. చాలా దయనీయ స్థితిలో బతుకులీడుస్తూ వారు ఆందోళన చేపట్టారు.

## ఇండియా — ఎయిర్ ఇండియా పైలెట్ల సమ్మె

జనవరి 14న ఎయిర్ ఇండియా పైలెట్లు సమ్మె చేపట్టారు. రెండు నెలల వేతనాల చెల్లింపులో ఆలస్యాన్ని వారు నిరసించారు. జనవరి 20 నాటికి బకాయిల చెల్లింపుకు ఎయిర్‌ఇండియా సిఎమ్‌డి ఇచ్చిన హామీతో సమ్మె ముగిసింది.

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010